
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
బుధవారం, 9 ఏప్రిల్ 2025





సేంద్రియ పేరుతో పాల ఉత్పత్తుల కల్తీ?

- ఫిర్యాదు చేసిన బాధితులు
- తనిఖీ చేపట్టిన ఆహారపు నాణ్యతా ప్రమాణాల అధికారులు

7



కల్లూరులో ఈదురు గాలులకు నేల వాలిన వరి



సత్తుపల్లి మండలం పాకలగూడెంలో నేలవాలిన అరటితోట



వేంసూరులో విరిగిపడిన విద్యుత్ స్తంభం



గుండాలలో భారీ వర్షానికి నేలకొరిగిన మొక్కజొన్న

నేలరాలిన ఆశలు

- ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ప్రకృతి బీభత్సం
- సాయంత్రం వేళ ఒక్కసారిగా గాలిదుమారం, భారీ వర్షం
- వివిధ రకాల పంటలకు తీవ్ర నష్టం
- చేలల్లో వాలిన వరి, మొక్కజొన్న పంటలు
- కాకర, చిక్కుడు, మునగ పంటలదీ అదే పరిస్థితి
- ఒరిగిన కరెంటు స్తంభాలు, భారీ వృక్షాలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిపోయిన ధాన్యం, మొక్కజొన్న రాసులు
- నేలరాలిన మామిడి... తోటలకు తీవ్ర నష్టం
- ఎగిరిపోయిన పలు ఇళ్ల పైకప్పులు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులకు అపార నష్టం

గాలి దుమారం, అకాల వర్షంతో అపార నష్టం

ఖమ్మం, ఆంధ్రజ్యోతి ప్రతినిధి/కొత్తగూడెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పెనుగాలులు ఒకవైపు... ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం మరోవైపు... మంగళవారం సాయంత్రం ఉమ్మడి జిల్లాలోని పలు మండలాలను అతలాకుతలం చేశాయి. వరి, మొక్కజొన్నతో పాటు వివిధ రకాల పంటలకు తీవ్ర నష్టం కలిగించాయి. కరెంటు స్తంభాలు విరిగిపడటంతో గ్రామాల్లో అంధకారం అలుముకుంది. గాలిదుమారంతో భారీ వృక్షాలు నేలకూలడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. మధ్యాహ్నం వరకు తీవ్రమైన ఎండ కనిపించగా, సాయంత్రం కల్లా వాతావరణం మారిపోయింది. ఒక్కసారిగా గాలిదుమారం మొదలైది, ఆ వెంటనే భారీ వర్షం దంచికొట్టింది.. దీంతో జనం బెంబేలెత్తారు. వివిధ పనులపైన బయట వున్న వారు ప్రాణాలు అర చేత పట్టుకొని సురక్షిత ప్రాంతాలకు పరుగులు దీశారు.

అశ్వారావుపేట రూరల్: అశ్వారావుపేట మండలంలో మండలంలో సోమవారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో, రాత్రి పది గంటల ప్రాంతంలో రెండు దఫాలుగా భారీగా గాలులు వీచాయి. గాలులకు వినాయకపురం, వేదాంతపురం, మల్లాయిగూడెం, రామన్నగూడెం, మామిళ్లవారిగూడెం, అశ్వారావుపేట ప్రాంతంలో విద్యుత్‌శాఖకు భారీగా నష్టం వాటిల్లింది. కరెంటు స్తంభాలు నేలకూలాయి. రెండు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయి. దాదాపు రూ.రెండు లక్షల మేర నష్టం వాటిల్లింది. కరెంటు స్తంభాలు పడిపోవటంతో మండలవ్యాప్తంగా సోమవారం రాత్రి అనేక గ్రామాలు అంధకారంలోనే ఉన్నాయి.

గాలులకు మామిళ్లవారిగూడెంలో నల్లాని వెంకటేశ్వరావుకు చెందిన 4 ఎకరాల మునగ తోట, నారంవారిగూడెంలో మంగా శ్రీనుకు చెందిన రెండున్నర ఎకరాల చిక్కుడు తోట, గుర్రాలచెరువు ప్రాంతంలో బూరుగు శ్రీనుకు చెందిన రెండు ఎకరాల కాకర తోట ఇలా అనేకమంది రైతులకు తోటలు నేలమట్టం అయ్యాయి. మినుము, జీడితోటలు, మొక్కజొన్న పంటలకు ఊహించని విధంగా (మిగతా 6వ పేజీలో)

కూలిన చెట్లు

వైరా: వైరాలో మంగళవారం రాత్రి ఏడున్నర గంటల సమయంలో భారీ ఈదురుగాలులు ప్రజాజీవనాన్ని అతలాకుతలం చేశాయి. ఈ భారీ ఈదురుగాలులకు వైరా-స్టేజీ పినపాక మధ్య జాతీయ ప్రధాన పక్కనున్న భారీ వృక్షాలు నేలకొరిగాయి. దాంతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వైరా ఎస్‌ఐ వంశీకృష్ణ భాగ్యరాజ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది రోడ్లపై పడిపోయిన చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. భారీ ఈదురుగాలులతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది.

ఘొల్లుమన్న కల్లూరు రైతులు

కల్లూరు: అకాల వర్షం, ఈదురు గాలులతో మంగళవారం కల్లూరు మండలంలో వరి పైరు వేల ఎకరాల్లో నేల వాలగా, మామిడి రాలటంతో నష్టం వాటిల్లింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబెట్టగా ధాన్యం రాశుల అడుగున వరద చేరింది. రైతులు వర్షంలో రాశుల వద్ద పడిగాపులు ఉండి పరదాలతో రక్షించుకునే ప్రయత్నంలో పడ్డారు. మామిడి నేలరాలటంతో బాధిత రైతులు దిగాలు పడ్డారు. యాసంగి సీజన్‌లో పుష్కలంగా పంట దిగుబడి అయిందని సంబర పడుతున్న రైతులు ఈదురు గాలులు, ఆకాల వర్షాలతో పరేషాన్ అవుతున్నారు. మామిడి నేల రాలటంతో మార్కెట్లో వ్యాపారులు కొనుగోలు చేయరు. దీంతో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కల్లూరు, పుల్లయ్యబంజర, కొర్లగూడెం, పేరువంచలో ధాన్యం కేంద్రాల్లో ధాన్యం రాశులపై కప్పిన పట్టాలు గాలిదుమారంతో ఎగిరి పడ్డాయి. వేల ఎకరాల్లో దిగుబడి అయిన ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. మంగళవారం సాయింత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈదురు గాలులతో చెట్లు కూలి విద్యుత్ స్తంభాలు విరగటంతో విద్యుత్ సరఫరా నిలిచింది.

ఏఐసీసీ సమావేశాలకు ముగ్గురు మంత్రులు

ఖమ్మం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాదులో జరుగుతున్న ఏఐసీసీ సమావేశాలకు జిల్లానుంచి ముగ్గురు మంత్రులు హాజరయ్యారు. మంగళ, బుధవారం రెండురోజులపాటు జరిగే ఈసమావేశాలకు జిల్లా నుంచి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు జిల్లాకు చెందిన రాజ్యసభ, లోక్‌సభ సభ్యులకు కూడా ఆహ్వానం ఉంది. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జాతీయస్థాయిలో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన అంశాలు, భవిష్యత్ కార్యచరణ, వివిధ అంశాలపైనా ఈసమావేశంలో చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు.

చాతకొండ 6వ బెటాలియన్‌కు
రూ. 20లక్షలు

- ఎంపీ రవిచంద్ర నిధుల నుంచి కేటాయింపు

కొత్తగూడెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చాతకొండలో గల టీజీఎస్‌పి 6వ బెటాలియన్‌లో పలు అభివృద్ధి పనుల కోసం రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తన ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.20లక్షలు మంజూరుచేశారు. ఈ మేరకు నిధులు కేటాయింపు లేఖను సంబంధిత అధికారులకు అందజేశారు. బెటాలియన్ కమాండెంట్ డి. శివ ప్రసాద్ రెడ్డి, ఆర్‌ఐ జీవీ. రామారావులు ఖమ్మంలో ఎంపీ రవిచంద్రను కలిసి బెటాలియన్‌కు నిధులుమంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందచేశారు. కొత్తగా ఏర్పడిన తమ బెటాలియన్‌కు ప్రత్యేక నిధులు (మిగతా 6వ పేజీలో)



'యువ' తరం కదిలింది

పేద, మధ్య తరగతి వర్గాలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస పథకానికి ఉమ్మడి జిల్లా నుంచి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఈ పథకానికి నిరుద్యోగులతో పాటు పలురకాల వ్యాపారాల్లో ఆసక్తి ఉన్న నిరక్షరాస్యులు సైతం దరఖాస్తులు చేస్తున్నారు. కొందరికి ఏ యూనిట్ పెట్టాలో తెలియకపోయినా సబ్సిడీ సొమ్ము కోసం ఏదో ఒక యూనిట్ అంటూ ఆన్‌లైన్‌లో ఆప్షన్ పెట్టుకుని దరఖాస్తు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖల ద్వారా లబ్ధిదారులకు ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన ఈ పథకానికి మొదట్లో ఓసీల్లోని ఈబీసీ వర్గాలను ప్రభుత్వం అనర్హులుగా ప్రకటించింది. అయితే ఓసీ సంక్షేమ సంఘంతో పాటు పలువురి అసంతృప్తి నేపథ్యంలో ఈబీసీలకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేశారు.

- రాజీవ్ యువ వికాస పథకానికి దరఖాస్తుల వెల్లువ
- పేద, మధ్యతరగతి వర్గాలకు ఉపాధి కల్పనే లక్ష్యం
- రూ.50వేల నుంచి రూ.4లక్షల వరకు యూనిట్లు
- అప్పుడే మొదలైన రాజకీయ పైరవీలు
- లబ్ధిదారుల ఎంపిక అధికారులకు పరీక్షే..
- ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం ఇబ్బందులు

ఖమ్మం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.8వేల కోట్లతో 4లక్షల 42వేల మందికి లబ్ధిచేకూరేలా రూ.50వేలనుంచి రూ.4లక్షల విలువ గల యూనిట్లకు సహాయం అందించేలా ప్రభుత్వం రాజీవ్ యువవికాస పథకాన్ని రూపొందించింది. ఈ పథకానికి ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తుండగా ఈనెల 14వరకు దరఖాస్తుకు గడువు ఉంది. గ్రామీణ ప్రాంతంలో ఏడాదికి రూ.లక్షా 50వేలు పట్టణాల్లో ఏడాదికి రూ.2లక్షల లోపు ఆదాయం ఉన్నవారు రేషన్‌కార్డు, కులధ్రువీకరణ, ఆధార్, పాన్‌కార్డు పత్రాలు సమర్పించాల్సి ఉంది. జులై 1 నాటికి 21నుంచి 55 ఏళ్లు ఉన్న వారికి, వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 21నుంచి 61ఏళ్లు ఉన్నవారికి అర్హత కలిపించారు. ప్రభుత్వ మార్జిన్ మనీతో పాటు బ్యాంకునుంచి కూడా రుణ సదుపాయంతో ఈ పథకం అందించనున్నారు.

వ్యవసాయరంగ యూనిట్లకు ప్రాధాన్యం

రాజీవ్ యువవికాస పథకంలో వ్యవసాయరంగ యూనిట్లకు ప్రాధాన్యత కల్పించారు. ఎండ్ల బండ్లు, ఆయిల్ ఇంజన్లు, పత్తి సేకరణ యంత్రం, వేరుశనగ యంత్రం, వర్మీ కంపోస్టు, ఆయిల్‌పామ్ సాగు, పశుపోషణ కింద గేదెలు, ఆవులు, డెయిరీఫామ్‌లు, కోడిగుడ్ల వ్యాపారం, చేపల వ్యాపారం, మేకలు, గొర్రెల పెంపకం, పాల వ్యాపారం, ప్యౌలీ ఫారం, ఎయిర్‌కూలర్ల వ్యాపారంతో పాటు స్టీల్‌సామగ్రి, ఆటోమోబైల్, బేకరీ, గాజుల షాపులు, హెయిర్‌కటింగ్, దుస్తుల తయారీ, బ్యూటీపార్లర్, జనరల్‌స్టోర్స్, ఇటుకల తయారీ, డిష్‌టీవీల ఏర్పాటు, వడ్రంగి వర్క్‌షాప్, సీసీకెమెరాల రిపేరు, ఎలక్ట్రికల్‌షాపు, మగ్గం, టైలరింగ్, చెప్పుల దుకాణం, పండ్ల వ్యాపారం ఇలా స్థానిక అవసరాలను ఉపాధిగా మారుస్తూ 75రకాలకుపైగా వ్యాపారాలను సూచించారు. ఇవి కాకుండా జిల్లా, మండలస్థాయిలో డిమాండ్‌ను బట్టి దరఖాస్తుదారుల కున్న నైపుణ్యత, అవగాహనను పరిగణలోకి తీసుకుని (మిగతా 6వ పేజీలో)

కల్యాణ రామునికి మహదాశీర్వచనం

- వేద మంత్రాలతో పులకించిన భద్రగిరి
- పట్టు వస్త్రాలు సమర్పించిన కంచి కామకోటి పీఠం



శ్రీ సీతారామచంద్రస్వామి

భద్రాచలం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కల్యాణ రాముడికి వేద మంత్రాలతో మహదాశీర్వచనంను(సదస్యం) వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలోని నిత్యకల్యాణ వేదికవద్ద మహదాశీర్వచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు తెలుగురాష్ట్రాల నుంచి చతుర్వేద పండితులు, ద్రవిడ దివ్యప్రబంధం పారాయణం చేసేందుకు పండితులు తరలివచ్చి భద్రాద్రి రామునికి తమ వేద మంత్రాలతో ఆశీర్వచనం పలికారు. కల్యాణం జరిగిన మూడో రోజున స్వామి వారికి మహదాశీర్వచనం నిర్వహించడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఇందులో భాగంగా కల్యాణ మూర్తులను నిత్య కల్యాణ మండప వేదిక వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద మం త్రాలతో స్వామి వారికి నిర్వహించిన మహదాశీర్వచనం ప్రతి ఒక్కరిని ఎంతగానో ఆకట్టుకుంది. కాగా, వేదాశీర్వచనాన్ని పురస్కరించుకొని కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో రామయ్యకు పట్టు వస్త్రాలను సమర్పించారు. కాగా, రాత్రి రామయ్యకు తిరువీధి సేవ నిర్వహిస్తుండగా, మధ్యలో (మిగతా 6వ పేజీలో)



లచ్చగూడెంలో సన్నబియ్యం లబ్ధిదారు ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్

నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే కనకయ్య, కలెక్టర్, పీవో
- కోయగూడెంలో నిరుపేద ఇంట్లో సన్నబియ్యం భోజనం

టేకులపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేదలందరికీ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇళ్లులేని నిరుపేదలందరికి ఇళ్లు మంజూరు చేస్తామని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా టేకులపల్లి మండలంలోని కోయగూడెంలో పైలెట్ ప్రాజెక్టు కింద రూ.15.15కోట్ల వ్యయంతో మంజూరైన 303 ఇళ్ల నిర్మాణాలకు మంగళవారం వారు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 లక్షల ఇస్తుందని, ఈ సొమ్ము నాలుగు దఫాలుగా అందించనున్నట్టు వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందన్నారు. అర్హత ఉన్న ప్రతి పేదవాడికి ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అనంతరం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగం గా మండలంలోని లచ్చగూడెం గ్రామంలో నిరుపేద గుమ్మడి సురేష్ ఇంట్లో ఏర్పాటు చేసిన సంహపక్తి భోజన (మిగతా 6వ పేజీలో)



వంతెన నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

కాంగ్రెస్ పాలనపై కేటీఆర్‌కు అసూయ

- కల్పిత కథలు సృష్టించడంలో రాజమౌళిని మించిపోయాడు
- సోషల్‌మీడియా ద్వారా అసత్య ప్రచారాలు
- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి

ఏన్కూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన కొద్దికాలంలోనే ప్రజలకు మంచి చేస్తున్న కాంగ్రెస్ పార్టీపై అసూయతో ట్విట్టర్, ఫేస్‌బుక్‌లలో అభ్యంతరకర పోస్టులు పెట్టి అసత్యప్రచారం చేస్తున్నాడని కేటీఆర్‌పై ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏన్కూరు మండలం మేడేపల్లి గ్రామంలో మంగళవారం పీఎంజేఎస్‌వై కింద రూ.4.50కోట్లతో నిర్మాణం చేపట్టే హైలెవల్ వంతెనకు ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్పిత గాథల సృష్టిలో దర్శకుడు రాజమౌళిని మించిపోయాడని కేటీఆర్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. హెచ్‌సీయూ భూముల విషయంలో కేటీఆర్ సోషల్‌మీడియా ద్వారా అసత్యప్రచారాలు చేయిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని రూ.7లక్షల కోట్ల అప్పులు చేసిన కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితయ్యాడని ఎద్దేవాచేశారు. కేవలం ఒకే ఒక్కసారి అసెంబ్లీకి హాజరకావడం ఏంటని ప్రశ్నించారు. ఖమ్మం జిల్లానుంచి అన్ని రంగాల్లో ముందుండేలా తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం మారుమూల గ్రామాల రోడ్ల అభివృద్ధికి విశేష కృషి చేస్తుందని తెలిపారు.

అనంతరం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు రూ.650కోట్లు ప్రతినెలా వడ్డీలు కట్టడానికే సరిపోతుందన్నారు. ఉచిత బస్సులకు రూ.350కోట్లు, ఉచిత విద్యుత్‌కు రూ.300కోట్లు నెలనెలా చెల్లించాల్సి వస్తుందన్నారు. కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి దశలవారీగా నెరవేరుస్తు వస్తున్నామన్నారు. మార్గమధ్యంలో రేపల్లెవాడ సమీపంలోని రాజీవ్ లింక్‌కెనాల్‌ను పరిశీలించారు. అనంతరం ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ కలిసి ఏన్కూరు కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి వంటగదులను, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని (మిగతా 6వ పేజీలో

మంత్రాల అనుమానంతో
కడతేర్చాడు

- కొమరం రాముడు అదృశ్యం ఘటనలో వీడిన మిస్టరీ
- సొంత అన్న కుమారుడే నిందితుడు
- తన కుటుంబానికి హాని తలపెడుతున్నాడని పగ
- బావమరిదితో కలిసి తాడుతో ఉరివేసి హత్య
- పోలీసు భయంతో నేరాన్ని అంగీకరించిన నిందితులు

6



కొమరం రాముడు(ఫైల్)

మహిళా సంఘాలకు ఉపాధి బాట

- మెప్మా ఆధ్వర్యంలో 83 బడుల విద్యార్థులకు యూనిఫామ్
- ఒక్కో జతకు రూ.50నుంచి రూ.75కు ధర పెంపు



మెప్మా ఆధ్వర్యంలోని టైలరింగ్ కేంద్రం

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని మహిళా సంఘాలకు వేసవి కాలంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కమిషనర్ అభిషేక్ అగస్త్య ఉపాధి బాటలు వేశారు. నగరంలోని 83 ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు 10వేల జతల దుస్తులు(యూనిఫామ్) ప్రభుత్వం నుంచి పంపిణీ జరగాల్సి ఉంది. దుస్తులను మెప్మా పర్యవేక్షణలో మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసి ఇవ్వనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ, పట్టణ పేదిరిక నిర్మూలన సంస్థతో ఒప్పందం చేసుకుంది.

గతేడాది ఒక్కో యూనిఫామ్ తయారీకి మహిళా సంఘాలకు రూ.50 ఇవ్వగా ఇప్పుడా ధరను పెంచారు. ఒక్కో జతకు రూ.75 ఇవ్వనున్నారు. ఇలా ఖమ్మం నగరంలోని 85 మహిళా స్వయం సహాయక సంఘాలకు యూనిఫామ్ తయారీ ద్వారా ఉపాధి కలగనుంది. గతంలో కంటే శిక్షణ పొందిన మహిళా సంఘాల సంఖ్యను మెప్మా ఆధ్వర్యంలో అందుబాటులో ఉంచారు. ఖమ్మం మెప్మా ఆధ్వర్యంలో యూనిఫామ్ తయారీలో పటిష్ఠమైన నిర్మాణం ఇప్పటికే కలిగి ఉంది. బల్లేపల్లి, చర్చికాంపౌండ్‌లో కుట్టు కేంద్రాలు ఏర్పాటు చేశారు. సరైన సమయంలో ప్రభుత్వ పాఠశాలలకు దుస్తులు అందిస్తున్నారు. యూనిఫామ్ ఆర్డర్ లేని రోజుల్లో ముంబై వంటి ఇతర నగరాల నుంచి దుస్తుల తయారీ ఆర్డర్‌లను తీసుకొని ఏడాది పొడవునా ఉపాధి పొందుతున్నారు. ఈ మేరకు ఆయా కుట్టు మిషన్ కేంద్రాలకు కావాల్సిన మిషన్లు మెప్మా పర్యవేక్షణలో అందుతున్నాయి. మారుతున్న కాలంతో పాటుగా మహిళలకు కుట్టు విధానాలపై ఎప్పటికప్పుడు శిక్షణకు పంపుతున్నారు.

- కోనసీమను తలపిస్తున్న తిరుమలాయపాలెం మండలం
- పచ్చని పైర్లతో ప్రాంతమంతా సస్యశ్యామలం
- నాడు నీళ్లులేక రైతులు అరిగోస
- నేడు అన్నదాతల ముఖాల్లో ఆనందం
- మంత్రి తుమ్మల కృషితో సస్యశ్యామలం

కరువు నేలలో పసిడి పంటలు



బచ్చోడు పెద్దచెరువు కింద సాగవుతున్న వరి

తిరుమలాయపాలెం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నిత్యం కరువు, దుర్భిక్షం, వలసలకు నిలయంగా మారిన తిరుమలాయపాలెం మండలం నేడు సస్యశ్యామలంగా మారింది. జిల్లాలో కరువు కాటకాలకు నిలయమైన తిరుమలాయపాలెం మండలం రాష్ట్రం ఏర్పడ్డాక కోనసీమను తలపిస్తోంది. ఎటుచూసినా పచ్చని పైర్లతో సస్యశ్యామలంగా కనిపిస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాగునీటి పథకాలతో మండలంలో వరిసాగు గణనీయంగా పెరిగింది. సాగునీటి కల్పనతో ఏడేళ్లుగా ఈప్రాంతంలో వ్యవసాయం వర్ధిల్లుతోంది.

మంత్రి పొంగులేటి దృష్టి..

నియోజకవర్గంలో రైతులు సాగుచేసిన వివిధ రకాల పంటలు ఎండిపోకుండా రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చర్యలు చేపడుతున్నారు. భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా మండలంలోని చెరువులు, కుంటలు నింపుతున్నారు. అన్నదాతలు సాగుచేసిన మొక్కజొన్న, వరి, మిర్చి, వేరుశనగ, పెసర పంటలు ఎండిపోకుండా అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. మారుమూల గ్రామాల్లో సైతం పంటలు ఎండిపోకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు.

వరి సాగుచేస్తున్న అన్నదాతల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది. రాష్ట్రం ఏర్పడక ముందు జిల్లాలో అత్యంత కరువు ప్రాంతంగా తిరుమలాయపాలెం మండలం ఉంది. ఎలాంటి సాగునీటి వనరులు లేక రైతులు వర్షాధార పంటలు సాగుచేసేవారు. వరుణ దేవుడు కరుణిస్తే పంటలు పండటం.. లేకుంటే ఈప్రాంత ప్రజలు కరువుకోరుల్లో చిక్కుకుని దుర్భర జీవితం గడిపేవారు. పంటలు పండకపోవడంతో ఈప్రాంత ప్రజలు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లేవారు . డిసెంబరు వచ్చిందంటే చాలు మెట్టపంటలు ఎండిపోయేవి. ఈప్రాంతంలో వరిసాగు లేక చెరువులు కుంటల కింద భూములు బీళ్లుగా మారేవి. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం తిరుమలాయపాలెం మండలంపై ప్రత్యేక దృష్టిసారించింది. మిషన్‌కాకతీయ కింద మూడు విడతలుగా చెరువులను బాగుచేసింది. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు పాలేరు నియోజకవర్గంపై దృష్టిసారించారు. కరువుపీడిత తిరుమలాయపాలెం మండలంపై ప్రత్యేక చొరవ చూపి భక్త రామదాసు ప్రాజెక్టు ఎత్తిపోతల నిర్మించి పాలేరు రిజ్వాయర్ ద్వారా కృష్ణాజలాలను కరువునేలలో పారించారు. ఈపథకం ద్వారా గత ఐదేళ్లుగా మండలతంలోని చెరువులు, కుంటలకు సాగునీరు సరఫరా చేస్తున్నారు దీంతో చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. బావులు, బోర్లలో సైతం భూగర్భజలాలు ఉప్పొంగాయి. దీంతో రైతులు మెట్టభముల్లో సైతం మడులు కట్టి వరి సాగుచేస్తున్నారు. మండలలోని వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న తదితర పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. మండలంలో మొత్తం 148 చెరువు కుంటల్లో గతంలో 4వేల ఎకరాల్లో వరి, మిర్చి 4వేల ఎకరాలు, పత్తి 24 ఎకరాల్లో



నీటితో కళకళలాడుతున్న బీరోలు చెరువు

మెట్టభూముల్లో సైతం మూడు పంటలు

కొలిచలం స్వామి, రైతు

తెలంగాణ రాకముందు చెరవులు, కుంటలు నెర్రెలు బారేవి. సాగుచేసిన మెట్టపంటలు ఎండిపోయేవి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో పంటలు పుష్కలంగా పండిస్తున్నాం. భక్తరామదాసు ప్రాజెక్టుతో ఎక్కడ చూసినా సాగునీటి కొరత లేదు.

సాగుచేసేవారు. భక్తరామదాసు ప్రాజెక్ట్ ద్వారా 13వేల ఎకరాల్లో వరా, 10వేల ఎకరాల్లో మిర్చి, 13వేల ఎకారల్లో పత్తి, మొక్కజొన్న 15వందల ఎకరాల్లో, పెసర 12వందల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. దీంతో రైతుల ఆదాయ వనరుల సైతం భారీగా పెరిగాయి.



భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్

ఆర్టీసికి నవమి ఆదాయం

అదుర్స్

- గణనీయంగా పెరిగిన రాబడి
- గత ఏడాది కంటే రూ.16.76 లక్షలు అధికం
- మూడు రోజుల్లో 78 సర్వీసులు
- 1.52 లక్షల కి.మీ. తిరిగిన వాహనాలు
- 82,138 మంది ప్రయాణం

భద్రాచలం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరామనవమి మహోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాచలం ఆర్టీసీ డిపోకు ఆదాయం గణనీయంగా పెరిగింది. ఈ నెల 5 నుంచి 7 వరకు మూడు రోజుల పాటు భద్రాచలం డిపో వివిధ రూట్లలో అదనంగా 78 బస్సులు నడిపింది. ఈ క్రమంలో 1,52,188 కి.మీ. మొత్తం బస్సులు తిరగగా ఇందులో 82,138మంది ప్రయాణించారు. దాని ద్వారా డిపోకు రూ.92.61 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆర్టీసీ డీఎం బి.తిరుపతి తెలిపారు. ఈ మూడు రోజుల్లో 37,638 మంది మహిళ ప్రయాణికులు ఉచిత బస్సు సౌకర్యంను ఉపయోగించుకున్నారని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది భద్రాచలం ఆర్టీసీడిపోకు 16.76 లక్షలు ఆదాయం అదనంగా వచ్చిందన్నారు. ఇదే సమయంలో 13,834 మంది ప్రయాణికులు అదనంగా ప్రయాణించారని వెల్లడించారు. బస్టాండు ఆవరణలో విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులచే దద్దోజనం, పానకం పంపిణీ చేశామన్నారు. త్రివేణి విద్యా సంస్థలు, ఐటీసీ పీఎస్‌పీడీ సహకారంతో మజ్జిగ ప్యాకెట్లు, తాగునీరు, పులిహోర, బిస్కెట్లు పంపిణీ చేశామన్నారు. తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్టు ద్వారా వలంటీర్లకు టీ షర్టులు అందించామని పాకాల దుర్గాప్రసాద్ టోపీలు అందించారని వివరించారు. చారుగుళ్ల శ్రీనివాస్ వాటర్ బాటిల్స్ అందజేయగా శ్రీరామనవమిని పురస్కరించుకొని ఆర్టీసీ ఉద్యోగులు అధిక ఆదాయం రావడంలో కృషి చేసినందుకు డీఎం వారిని, సహకరించిన వారిని అభినందించారు.

సింగరేణి ప్రాజెక్టుల భూముల లీజు పొడిగింపు

ఇల్లెందు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ ఇల్లెందు పరిధిలోని టేకులపల్లి మండలం కోయగూడెం ఓపెన్ కాస్టు బొగ్గుగని భూముల లీజు గడువు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల జారీచేసింది. కోయగూడెం ఓపెన్‌కాస్టు-1, బొగ్గుగనికి 247హెక్టార్ల భూముల లీజును 13 మే 2057వ సంవత్సరం వరకు పెంచుతూ ప్రభుత్వ ఎనర్జీ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సల్తానియా ఉత్తర్వులు విడుదల చేశారు. జీఎంఎస్ నెం.9, తేదీ 3.4.2025 ద్వారా జారీచేసిన ఉత్తర్వుల్లో కోయగూడెం ఓసీపీ ఏరియా చాతకొండ రిజర్వు ఫారెస్టు కంపార్ట్‌మెంట్ 36, 37లలోని 236 హెక్టార్ల అటవీభూమి, కోయగూడెం గ్రామ పరిసరాల్లోని సర్వేనెం. 103, 1004లో గల అటవీరహిత భూమి 11హెక్టార్లు సింగరేణి కాలరీస్ సంస్థకు కేటాయిస్తూ మైనింగ్ లీజును 2051మే 13 వరకు పొడిగించారు. టేకులపల్లి మండలం కొప్పురాయి, గంగారం ప్రాంతాల్లో 446-10హెక్టార్ల భూముల లీజును 2065అక్టోబరు12 వరకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జీవో నెం. 10(3.4.2025) ద్వారా రాష్ట్రప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీచేశారు. లీజు పొడిగించిన 446.10 హెక్టార్ల భూములో231.84హెక్టార్ల అటవీభూమి ఉండగా 214 హెక్టార్ల నాన్‌ఫారెస్ట్ భూమి ఉంది. కొత్తగూడెం డివిజన్‌లోని చాతకొండ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోగల కంపార్ట్‌మెంట్ నెం.33, 34, 36, 37ల అటవీభూము లీజును సింగరేణి కాలరీస్ మైనింగ్ అపరేషన్ల కోసం 2065వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

20నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియట్, పదో తరగతి ఓపెన్ స్కూల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్నపత్రాలను కేంద్రాలకు తరలించే సమయాల్లో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇంటర్‌కు నాలుగు సెంటర్లు ఏర్పాటుచేస్తున్నామని, 826మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని అన్నారు. పదో తరగతికి మూడు సెంటర్లు ఏర్పాటుచేస్తున్నామని, 720మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని అన్నారు. సిట్టింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

నేలరాలిన ఆశలు..

(5వ పేజీ తరువాయి)

నష్టం వాటిల్లింది. అలాగే మంగళవారం సాయంత్రం వచ్చిన గాలులకు గాండ్లగూడెం, వినాయకపురం, మల్లాయిగూడెం, అశ్వారావుపేట, రామన్నగూడెం, అనంతారం, పండువారిగూడెం, నారంవారిగూడెం, ఊట్లపల్లి ప్రాంతాల్లో మామిడి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రెండు రోజుల్లో వీచిన బలమైన గాలులకు కాయలు మొత్తం నేలరాలాయి. అనేక గ్రామాల్లో వేరుశనగను పీకి పొలాల్లో ఉంచగా మొత్తం తడిచిపోయింది. గాలులకు పలు గ్రామాల్లో ఇంటిపైకప్పులు, రేకులు కూలిపోయాయి. భద్రాచలం రోడ్‌లోని ఊట్లపల్లి సమీపంలో భారీ వృక్షం నేల కూలింది. నడిరోడ్డుపై చెట్టు పడిపోవటంతో రాకపోకలు నిలిచిపోయాయి. దాదాపు మూడు గంటల పాటు వాహనాలు అక్కడే ఆగిపోయాయి. సాయంత్రం నాలుగు గంటల సమయంలో చెట్టుపడిపోవటంతో అదే సమయంలో పాఠశాల బస్‌లు వెళ్లనుండటంతో విద్యార్థులు ట్రాఫిక్‌లో ఇరుక్కుని ఇబ్బందులు పడ్డారు.

భద్రాద్రిలో విరిగిన చెట్టు కొమ్మలు

భద్రాచలం: భద్రాచలంలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా గాలి దుమారం, వర్షం వచ్చింది. దీంతో పలు చోట్ల విద్యుత్తు తీగలపై చెట్లు పడి గంటకు పైగా విద్యుత్తు సరఫరాకు ఆటంకం ఏర్పడింది. వెంకటేశ్వర కాలనీలో విద్యుత్తు తీగలపై చెట్టు కొమ్మ విరిగిపడటంతో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. ఈ సమయంలో ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం ఇవ్వగా వెంటనే స్పందించి వారు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు. అలాగే ఇతర ప్రాంతాల్లో సైతం విద్యుత్తుకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టి విద్యుత్తు శాఖ అధికారులు విద్యుత్తును పునరుద్ధరించారు.

గుండాలలో భారీ వర్షం

గుండాల మండలంలో సోమవారం ఉరుములు, మెరుపులు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అకాల వర్షానికి మొక్కజొన్న చేన్లు పంట చేతికందే సమయంలో నేలపాలయ్యాయి. ఆరబోసిన మొక్కజొన్నలు తడసిపోయాయి. పలు చోట్ల ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. సాయనపల్లి, ముత్తాపురం, పడుగోనిగూడెం, రోళ్లగడ్డ, పెద్దతోగు గ్రామాల్లో మొక్కజొన్న చేన్లు నేలపై పడిపోయాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారులపై పెద్దపెద్ద చెట్లు పడిపోవడంతో విద్యుత్ స్తంబాలు నేల మట్టం అయ్యాయి. దీంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండల కేంద్రంలోని ఇనుముల సమ్మయ్యకు చెందిన ఇంటితో పాటు స్థానిక ప్రగతీ విద్యాలయంపై రేకులు గాలికి లేచిపోయాయి.

జూలూరుపాడు మండలంలో...

జూలూరుపాడు: వాతావరణం ఒక్కసారిగా చల్లబడి మంగళవారం సాయంత్రం మండలంలోని పలు గ్రామాలలో గాలి దుమారంతో పాటు వర్షం కురిసింది. జూలూరుపాడు, వెంగన్నపాలెం, వినోభానగర్ తదితర గ్రామాలలో ఓ మోస్తారు వర్షం కురిసింది. గాలి దుమారంతో మామిడి నేలరాలాయి. మిర్చి తడిసింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

సత్తుపల్లిలో అకాలవర్షం

సత్తుపల్లిలో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి, సోమవారం రాత్రి వచ్చిన గాలిదుమారం కారణంగా రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కల్లాల్లో, కొనుగోలు కేంద్రాలలో ఆరబెట్టిన వరి, మొక్కజొన్న రైతులు పరుగులు పెట్టారు. వర్షానికి తడవకుండా పరదాలు కప్పే క్రమంలో నానా అగచాట్లు ఎదుర్కోగా ప్రభుత్వం ఆలస్యంగా కేంద్రాలను ఏర్పాటు చేయగా మరి కొందరు ఇప్పటికే ధాన్యపు రాశులను తక్కువకే దళారులకు వరి రైతులు విక్రయించారు. అరటి మొక్కలు గాలిదుమారానికి నేలకొరగగా మామిడి నేలరాలిందని రైతులు వాపోయారు.



అశ్వారావుపేట మండలం ఊట్లపల్లిలో రోడ్డుకు అడ్డంగా పడిపోయిన భారీ వృక్షం

నేలరాలిన మామిడి

వేంసూరు మండలంలో సోమ,మంగళవారాల్లో గాలిదుమారం బీభత్సం సృష్టించింది. దీంతో వరి, మొక్కజొన్న పంటలు నేలమట్టమయ్యాయి. ఈ సమయంలో గాలివానకు కల్లాలో ఆరబోసిన ధాన్యం, మక్కలు తడిసి ముద్దయ్యాయి. అదేవిధంగా మామిడితోటల్లో కాపుకు వచ్చిన మామిడి గాలిదుమారానికి నేలరాలాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే మండలంలో సుమారు ఏడు విద్యుత్ నేలకొరగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అలాగే తల్లాడ మండలంలో మంగళవారం రాత్రి ఈదురుగాలులతో మామిడిపంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. సుమారు గంటపాటు బలమైన ఈదురు గాలులు వీచాయి. మామిడిచెట్లకు ఉన్న కాయలు నేలరాలాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కల్లాల్లోని ఆరబోసిన మిర్చి, ధాన్యంపై కప్పిన టార్పాలిన్ పట్టాలు లేచిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు

ఎర్రుపాలెం మండలంలోరాజులదేవరపాడు , సఖినవీడు, మామునూరు గ్రామాల్లో గత రెండు రోజులుగా వీస్తున్న ఈదురుగాలులకు దెబ్బతిన్న మొక్కజొన్న, మామిడి పంటలను మగళవారం వ్యవసాయాధికారులు పరిశీలించారు. పంట నష్టంపై ప్రాథమిక అంచనావేశారు. పూర్తిస్థాయిలో పడిపోయిన మక్కపంటలను మాత్రమే పరిగణలోకి తీసుకన్నామని, నష్టాన్ని ప్రాథమికంగా అంచనావేసి ఉన్నతాధికారులకునివేదికలు పంపినట్టు తలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో బోయినపల్లి సాయిశివ, ఉద్యానశాఖ అధికారి విష్ణు, ఏఈవోలు వంశీకృష్ణ, కృష్ణకుమారి, గోపి నాయక్ రైతులు పాల్గొన్నారు.

‘యువ’తరం కదిలింది..

(5వ పేజీ తరువాయి)

కొత్తతరహా వ్యాపారాలకు ప్రభుత్వం సాయం అందించనుంది. ఆన్‌లైన్ వ్యాపారాలు, ఇంటివద్ద నుంచే పిండి వంటల తయారీ, ఎగుమతులు చేసుకునే సౌలభ్యం కల్పించారు.

వ్యాపారుల నుంచే ఎక్కువ దరఖాస్తులు

నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఈ పథకానికి ప్రస్తుతం ఏదో ఒక వ్యాపారం చేస్తున్న వారే అధికంగా దరఖాస్తు చేస్తున్నారు. పలురకాల వ్యాపారాలు, షాపులు నిర్వహిస్తున్న వారు ఈ పథకం ద్వారా అందే సాయంతో ప్రస్తుతం ఉన్న తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునేందుకు అవసరమైన పెట్టుబడి కావాలని కొందరు, తమ షాపులను మోడల్‌గా తయారుచేసి ఆకర్షనీయంగా అదనపు సామగ్రి పెట్టేందుకు మరికొందరు దరఖాస్తు చేస్తున్నారు. ఎక్కువగా కిరాణషాపుల కోసం దరఖాస్తులు వస్తున్నాయి.

అధికారులకు పరీక్షగా లబ్ధిదారుల ఎంపిక

రాజీవ్ యువవికాస పథకం లబ్ధిదారులను జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాటికి ఎంపిక చేయాలని ప్రభుత్వం గడువు విధించింది. అయితే లక్షల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నందున వీటిని పరిశీలించడం, లబ్ధిదారులను ఎంపిక చేయడం అధికారయంత్రాగానికి పరీక్షగా మారబోతోంది. వ్యాపారంపై అవగాన లేకపోయినా చాలామంది ఏదో ఒక యూనిట్‌పేరుతో దరఖాస్తు చేస్తున్నారు. తమకు యూనిట్ మంజూరైతే తర్వాత దాన్ని అమ్ముకుని ప్రభుత్వ సబ్సిడీని సొమ్ముచేసుకోవాలనే ఆలోచనతో చాలామంది ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. మంజూరైన యూనిట్‌ను లాభదాయకంగా నడిపించే వ్యాపార దక్షత లేనివారికి యూనిట్లు మంజూరు చేస్తే గతంలో ప్రభుత్వ పథకాలు దుర్వినియోగమైనట్లే ఈ పథకం దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితిని అధిగమించాలంటే ఎంపికైన లబ్ధిదారులకు ఆయన యూనిట్ల పట్ల స్పష్టమైన అవగాహన కల్పించడంతో పాటు మార్కెట్‌లో డిమాండ్ తదితర అంశాలపై అవగాహన కల్పించాలి.


అప్పుడే పైరవీల జోరు

రాజీవ్ యువ వికాస పథకం అర్జీలు పెట్టిన అనేకమంది దరఖాస్తుదారులు అప్పుడే పైరవీలు ప్రారంభించారు. పలురకాల కులవృత్తి సంఘాలవారు తమవారికే అధికంగా యూనిట్లు ఇవ్వాలని విజ్ఞప్తులు చేస్తున్నారు. మరోవైపు కొందరు చోటామోటా నాయకుల వద్దకు వెళ్లి ప్రజాప్రతినిధుల ద్వారా తమకు యూనిట్ వచ్చేలా చూడాలని పైరవీలు సాగిస్తున్నారు. గతంలో జిల్లాలో దళితబంధు పథకం కింద భారీగా యూనిట్లు మంజూరు కాగా ఆయా యూనిట్లపై అవగాహన లేకపోవడంతో చాలామంది తమ యూనిట్లను విక్రయించారు. దళితంబంధు పథకానికి చింతకాని మండలాన్ని మోడల్‌గా ఎంపిక చేయడంతో ఈ మండలంలో సుమారు 5వేల మందికి రూ.400కోట్ల వరకు ఖర్చు చేసి యూనిట్లు మంజూరు చేశారు. కానీ ఇప్పుడు ఆ మండలంలో సగం యూనిట్లు కూడా లబ్ధిదారుల వద్ద లేవు. యూనిట్లపై ఎలాంటి అవగాహన లేకపోవడం కొందరు దళారుల ప్రమేయంతో వాటిని అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజీవ్ యువ వికాసం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

చాతకొండ 6వ బెటాలియన్‌కు రూ. 20లక్షలు

(5వ పేజీ తరువాయి)

లేకపోవడంతో చేత అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామని చెప్పారు. ఎంపీ ల్యాడ్స్ నిధులుమంజూరు చేస్తే బెటాలియన్‌లో సెల్యూటింగ్ డయాస్, గ్యాలరీ నిర్మాణ పనులు చేపడతామని అన్నారు. బెటాలియన్ అధికారుల విజ్ఞప్తి మేరకు వద్దిరాజు తన ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.20లక్షలు మంజూరు చేస్తూ అందుకు సంబంధించిన లేఖను కూడా బెటాలియన్ కమాండెంట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్రకు బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



వద్దిరాజుకు పుష్పగుచ్ఛాన్ని కమాండెంట్ శివ ప్రసాద్ రెడ్డి

కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ అసూయ

(5వ పేజీ తరువాయి)

ఎస్‌వోను ఆదేశించారు. కాస్మెటిక్ చార్జీలను ప్రభుత్వం వందశాతం పెంచిందని తెలిపారు. అనంతరం బాలికలతో కలిసి భోజనం చేశారు. ఈకార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుత్తా వెంకటేశ్వరరావు, ఏబ్లాక్ అధ్యక్షుడు వేముల కృష్ణప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్, పంచాయతీరాజ్ ఈఈ వెంకటరెడ్డి, డీఈ కరుణాకరరెడ్డి, మండల నాయకులు మేడ ధర్మారావు, లాలునాయక్, చందులాల్‌నాయక్, పటాన్‌మజీద్ ఖాన్, కట్టా సత్యనారాయణ, పూర్ణకంటి మైసారావు, ప్రభావతిరెడ్డి, చందమామ నరసింహారావు, వాసిరెడ్డి నాగేశ్వరరావు, దళపతి భువనేశ్వరరాజు, మాలోత్ నరసింహారావు, చింతనబోయిన సీతారాములు, ఇవూరి సైదులు, పూనెం కృష్ణ, నరసింహారావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రాల అనుమానంతో కడతేర్చాడు..

- కొమరం రాముడు అదృశ్యం ఘటనలో వీడిన మిస్టరీ

దుమ్ముగూడెం ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గత నెలరోజులుగా కనబడకుండా పోయిన వ్యక్తి చివరికి చెరువులో శవమై కనిపించాడు. మంత్రాలతో తన కుటుంబానికి హాని చేస్తున్నాడనే కోపంతో ఓ వ్యక్తి.. తన సొంత బాబాయినే హత్య చేశాడు. ఈ ఉదంతం మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలో వెలుగు చూసింది. మండలంలోని జెడ్ వీరభద్రాపురానికి చెందిన కొమరం రాముడు(50)ను అతడి సొంత అన్న కుమారుడు కొమరం వెంకటేష్ తన బావమరిది పద్దం బాలరాజుతో కలిసి హత్య చేసి ఒక సంచిలో మూటకట్టి స్థానిక చెరువులో పడేశాడు.

కొమరం వెంకటేష్ అన్న కొమరం రాంబాబు ఫిబ్రవరి 12న చర్ల మండలం గోగుబాక వద్ద రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. కొన్నేళ్ల క్రితం అతడి తండ్రి అనారోగ్యంతో మృతిచెందాడు. వెంకటేష్ భార్య కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతోంది. వీటన్నింటికీ తన బాబాయి కొమరం రాముడే కారణమని, మంత్రాలు వేసి తన కుటుంబానికి హాని చేస్తున్నాడనే కారణంతో వెంకటేష్ రాముడిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకు తన బావమరిది సాయాన్ని తీసుకున్నాడు. గత నెల 11వ తేదీన రాముడు తన భార్యతో కలిసి స్థానికంగా జరిగిన ఒక ఫంక్షన్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో నిందితులు కొమరం వెంకటేష్, పద్దం బాలరాజు ముందుగా వేసుకున్న పథకం ప్రకారం మద్యం తాగుదామని రాముడిని ఊరి బయట ఉన్న చెరువు కట్టకు తీసుకెళ్లారు. అక్కడ అతడికి బాగా మద్యం తాగించి ఒక ప్లాస్టిక్ తాడుతో అతడి మెడకు ఉరి బిగించి చంపారు. అనంతరం మృతదేహాన్ని ఒక గన్నీ బ్యాగులో కట్టి, బంక మట్టితో నింపిన మరో బ్యాగును బరువుగా కట్టి చెరువులో పడేశారు. రాముడి భార్య ఫిరాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు పలుకోణాల్లో విచారణ చేస్తుండగా భయపడ్డ నిందితులు పోలీసుల ఎదుట లొంగిపోయి తామే హత్య చేసినట్లు అంగీకరించారు. హత్య జరిగిన తీరును నిందితులు పోలీసులకు వివరించారు. నిందితులు చెప్పిన వివరాల ప్రకారం పోలీసులు మృతదేహాన్ని చెరువు నుంచి బయటికి తీసి పోస్టుమార్టం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. నిందితులిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ తెలిపారు.

నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

(5వ పేజీ తరువాయి)

కార్యక్రమంలో ఎమ్మెల్యే, కలెక్టర్, పీవోలు పాల్గొని ప్రజలతో కలిసి భోజనం చేశారు. పేదలకు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో రాహుల్, హౌసింగ్ పీడీ శంకర్, ఏఈ డేవిడ్, తహసీల్దార్ నాగభవానీ, ఎంపీడీవో రవీందర్‌రావు, ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, ఏవో అన్నపూర్ణ, ఎంపీవో గణేష్ గాంధీ, టేకులపల్లి సీఐ టి.సురేష్, ఎస్సైలు సురేష్, శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, మాజీ సర్పంచ్ ఉమాసురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ రామునికి మహదాశీర్వచనం

(5వ పేజీ తరువాయి)

వర్షం రావడంతో స్వామి వారిని ఆలయానికి వెంటనే తీసుకువచ్చారు.

ఈ కార్యక్రమంలో భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవో శ్రావణ్ కుమార్, ఆలయ పర్యవేక్షకులు సాయిబాబా, శ్రీ చక్రా సిమెంట్స్ ఎండీ నేంద్రగంటి కృష్ణమోహన్, స్థానాచార్యులు కేశీ స్థలశాయి, విశ్రాంత ప్రధాన అర్చకుడు పొడిచేటి రామచంద్రాచార్యులు, ప్రధాన అర్చకుడు అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకుడు అమరవాది వెంకట శ్రీనివాస రామానుజం, ముఖ్య అర్చకులు పొడిచేటి రామభద్రాచార్యులు, అమరవాది మధుసూదనాచార్యులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లోభాగంగా బుధవారం తెప్పోత్సవం, చోరోత్సవం నిర్వహించనున్నారు.

ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

» కలెక్టర్ జితేష్ వి పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించడానికిఅన్నిశాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ఆహారభద్రత, ఆరోగ్యకరమైన ఆహారాలపై జిల్లా స్థాయి సలహా కమిటీ (డీఎల్ఏసీ) కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లకు నాణ్యమైన ఆహారం ప్రజలకు అందించడానికి అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల శ్రేయస్సు కోసం వ్యాపారస్తులు ఆహార భద్రత యొక్క ప్రమాణాలను పాటించాలని తెలిపారు. అనారోగ్యకరమైన, గడువు ముగిసిన ఆహార ఉత్పత్తి ఉత్పత్తులను ముఖ్యంగా పిల్లలకు లక్ష్యంగా చేసుకుని వాటి అమ్మకాలను పర్యవేక్షించడం, వాటిని నివారించడానికి నిరంతర సోదాలు చేపట్టాలని వైద్యశాఖాధికారులను ఆదేశించారు. ఎఫ్ఎస్ఎస్ఏఐకి సంబంధించి, ఆహార భద్రత, ధృవీకరణ వ్యవస్థ కింద ఆహార వ్యాపారులకు క్రమబద్ధమైన శిక్షణ నిర్వహించాలన్నారు. జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు వసతిగృహాల్లో వైద్యశాఖాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆహార పదార్థాల నిల్వ చేసే ప్రదేశాలు, వంటగది తనిఖీ చేసి ఏమైన సమస్యలు ఉంటే నివేదికలు అందించాలని కలెక్టర్ తెలిపారు. 100మంది కంటే ఎక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రానున్న పది రోజుల్లో జిల్లాలోని అన్ని పాఠశాలలు వసతిగృహాల్లో పర్యటించి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆయన అన్నారు. వేసవిలో ఐస్ వినియోగం అధికంగా ఉంటుందని, ఈ ఐస్ ఎక్కడి నుంచి వస్తుంది.. ఐస్ తయారీకి ఉపయోగించే నీరు వారు పాటిస్తున్న నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, అధికారులు భాస్కర్‌నాయక్, బాబురావు రుక్మిణి, పృథ్వీ, శ్యాంకుమార్, సంపత్‌కుమార్, వ్యాపారస్తులు కృష్ణారెడ్డి, నాగేశ్వరరావు, తదితరులున్నారు.

కల్లాల్లోనే ధాన్యం..

» కరకగూడెం మండలంలో నేటికీ ఏర్పాటు చేయని కొనుగోలు కేంద్రాలు
» ఇబ్బందులు పడుతున్న రైతులు
» పట్టించుకోని అధికారులు
» దళారులను ఆశ్రయిస్తున్న రైతులు


కరకగూడెంలో ఉన్న ధాన్యం రాసులు

కరకగూడెం, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించేందుకు అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు. పినపాక నియోజవర్గంలోని మారుమూల ప్రాంతం అయిన కరకగూడెం మండలంలోని రైతులు ఎక్కువగా ధాన్యం పంటల పైనే ఆధారపడి పంటలను సాగు చేస్తారు. ఇక్కడ రైతులు తాము పండించిన పంటలు కోతల దశలోకి రావడంతో రైతులు తమ పంటలను కోత మిషన్ల ద్వారా కోతలను ముమ్మరం చేశారు. కోతలు కోసిన ధాన్యాన్ని రైతులు కాలి ప్రదేశాల్లో, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే ప్రదేశాల్లో ధాన్యం ఆర పోశారు. సుమారు 20 రోజులుగా రైతులు తమ పంటలను ముమ్మరంగా కోసి ధాన్యం ఆర పోసుకుని ఉన్నప్పటికీ నేటికి అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక వైపు అకాల వర్షాలు రైతులను ఆందోళనకు గురిచేస్తుంటే, ఉన్నత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా దళారులు రైతులను నట్టేట ముంచుతూ తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులను నిండా ముంచుతున్నారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరతగతిన ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.


ముమ్మరంగా కోతలు కోస్తున్న మిషన్

21 వేల ఎకరాలలో సాగు

పినపాక నియోజకవర్గంలో రైతులు యాసంగిలో ధాన్యం పంటలుగా 21వేల ఎకరాల్లో సాగు చేశారు. ఇందులో కరకగూడెం మండలంలో 6వందల ఎకరాలు, పినపాక మండలంలో 9,300 ఎకరాలు, మణుగూరు మండలంలో 4వేల ఎకరాలు, అశ్వాపురం మండలంలో 3 వేల ఎకరాలు, బూర్గంపాడు మండలంలో 3,700 ఎకరాలు, గుండాల మండలంలో 70 ఎకరాలు, ఆళ్లపల్లి మండలంలో 280 ఎకరాల్లో మొత్తం 21 వేల ఎకరాల్లో రైతులు ధాన్యం పంటను సాగు చేశారు. రైతుల పంటలు కోతల దశలోకి రావడంతో కోతలు కోసిన రైతు లు తమ ధాన్యం విక్రయించుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

● బుడగం రాము, కరకగూడెం రైతు



ధాన్యం కోతలకు రావడంతో కోతలు కోసి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే ప్రదేశాల్లో పోశాము. నేటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. కొందరు రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలని అనుకున్న కేంద్రాలు లేక పోవడంతో దళారులకు విక్రయిస్తున్నారు. త్వరతగతిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

అధికారులు పట్టించుకోవడం లేదు

● కొమరం కాంతారావు, సీపీఎం మండల కార్యదర్శి



రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం పంటను అమ్ముకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నప్పటికీ ఉన్నత అధికారులు మాత్రం పట్టించుకోక పోవడం నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా కనిపిస్తుంది. ఇదే అదునుగా చూస్తున్న దళారులు అమాయక రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

దళారీ వ్యవస్థను రూపుమాపుతాం

» సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్‌రాజ్‌కుమార్


మాట్లాడుతున్న కిరణ్‌రాజ్‌కుమార్

రుద్రంపూర్ (సింగరేణి), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణి మెడికల్‌బోర్డులో దళారీ వ్యవస్థను రూపుమాపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని సింగరేణి చీఫ్‌మెడికల్ ఆఫీసర్ ఆర్. కిరణ్‌రాజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ప్రధాన ఆసుపత్రిలో విలేకర్లతో మాట్లాడుతూ మెడికల్‌బోర్డును పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. మెడికల్‌బోర్డులో అవకవకలపై సింగరేణి విజిలెన్స్, ఎస్అండ్‌పీసీ తదితర విభాగాలతో విచారణ జరిపిస్తామని, సింగరేణి ఉద్యోగులు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలకు వెనుకాడేది లేదన్నారు. సింగరేణి సంస్థ ఏ లక్ష్యంతోనైతే పని చేస్తుందో అది నెరవేరుస్తామని అవినీతి మచ్చలను తొలగిస్తామన్నారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో పని ఏడు ప్రధాన ఆసుపతులతోపాటు 21 డిస్పెన్సరీలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తామని త్వరలో మరిన్ని వైద్య నియామకాలకు నోటిపికేషన్లను విడుదల చేయనున్నట్లు తెలిపారు. సింగరేణిలో పని చేస్తున్న కార్మికులు, విశ్రాంతి కార్మికులు, కార్మిక కుటుంబసభ్యులు, కాంట్రాక్టు కార్మికులకు సింగరేణి ఆసుపత్రుల ద్వార వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. రామగుండం ఏరియాలో 12 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సూపర్‌స్పెషాలిటి ఆసుపత్రిపనులు శరవంగంగా కొనసాగుతున్నాయనితెలిపారు. కార్మికసంఘాలు, కార్మికుల విజ్ఞప్తి మేరకు హైదరాబాద్‌లో సైతం సూపర్‌స్పెషాలిటీ హస్పటల్ ఏర్పాటుకు సింగరేణి యజమాన్యం సిద్దంగా ఉందని తెలిపారు. సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం వైద్యరంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. వైద్యులు రోగుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని వైద్యశాలకు వచ్చే కార్మికులు, కార్మిక కుటుంబసభ్యుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత సిబ్బందిపై విచారణ జరిపి శాఖాపైన చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యులు, వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించి యజమాన్యం చేపట్టే విధానాన్ని వివరిస్తామని చెప్పారు. అత్యవసర సేవలను మరింత అందుబాటులో తెచ్చి సింగరేణీయులతోపాటు సమీప ప్రాంత ప్రజలకు సైతం మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు.

350 క్వింటాళ్ల బియ్యం పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న లారీ

ములకపల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అనుమతి పత్రాలు లేని 350 క్వింటాల బియ్యాని లారీలో తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న ఘటన జగన్నాదపురం గ్రామ సమీపంలో మంగళవారం జరిగింది. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ నుంచి బియ్యాన్ని లారీలో తరలిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేసిపట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం రేషన్ బియ్యమా కాదా అని సివిల్‌సప్లై అధికారులు ధృవీకరించాల్సి ఉందని తెలిపారు. రేషన్ బియ్యమని ధృవపడితే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. బియ్యంతో సహా లారీని ములకలపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

రెండు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక


నైమిష

మధిర రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం దెందుకూరు గ్రామానికి చెందిన గుర్రం నైమిష కేంద్ర ప్రభుత్వ శాఖల్లో రెండు ఉద్యోగాలు సాధించింది. గుర్రం కళాధర్ కుమార్తె అయిన నైమిష 2024వ సంవత్సరంలో వచ్చిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్ రెండు శాఖల్లోని ఉద్యోగాలకు పరీక్ష రాసింది. ఇన్‌కంట్యాక్స్ డిపార్టుమెంట్, ఇంటిలిజెన్సీ బ్యూరో మినిస్టర్ ఆఫ్ హోమ్ అఫైర్స్ శాఖల్లో ఆఫీసర్‌గా రెండు ఉద్యోగాలు సాధించింది. నైమిష రెండు ఉద్యోగాలు సాధించినందుకు కుటుంబసభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

ఎలక్ట్రానిక్ పరికరాలతోనే మానవాళి మనుగడ

» కెఎస్ఎం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ హరికృష్ణ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడ ప్రస్తుతం ఎలక్ట్రానిక్స్ పరికరాలతోనే ముడిపడి ఉందని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (కెఎస్ఎమ్)కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ హరికృష్ణ తెలిపారు. మంగళవారం కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో డిజిటల్ కమ్యూనికేషన్ అనే అంశంపై సదస్సును నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్స్ పరికరాల నిర్మాణం, వాటి పని తీరు గురించి వివరించారు. ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌ని ఎలా తయారు చేయాలో డిజిటల్ కమ్యూనికేషన్ గురించి వివరించారు. ప్రస్తుత బిజీ ప్రపంచంలో ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం లేనిదే మానవుని మనుగడ అసాధ్యమైనదన్నారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్ డాక్టర్ శారద, అధ్యాపకులు జి.మంజుల, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిందితుల రిమాండ్


నిందితులతో ఎక్సైజ్ అధికారులు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో గంజాయి అమ్మకాలు చేస్తున్న నలుగురిని రిమాండ్ చేసినట్లు ఖమ్మం వన్‌టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. రాజీవనగర్ గుట్ట, ఇండస్ట్రీయిల్ ఏరియా, ఖానాపురం, వేణుగోపాల్‌నగర్ ప్రాంతాలకు చెందిన ఎస్‌కే ఖలీల్ పాషా, పశువుల ఉదయ్‌కుమార్, కొమ్మరబోయిన నవీన్, బాతుల వెంకటేష్ ముఠాగా ఏర్పడ్డారు. స్థానికంగా ఉన్న యువతకు ఎండు గంజాయిని అమ్మకాలు చేస్తూ, వారిని మత్తులోకి దింపుతున్నారు. ఈక్రమంలో మంగళవారం ఎక్సైజ్‌శాఖ అధికారులు వాహన తనిఖీలు చేస్తుండగా వీరితోపాటు 670 గ్రాముల ఎండు గంజాయిని, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కల్లూరు,ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని ముగ్గువెంకటాపురంలో మంగళవారం రహదారి పక్కన గుర్తుతెలియని వ్యక్తి ఆపసార్మకస్థితిలో పడి ఉండటాన్ని గ్రామస్థులు గుర్తించారు. సదరు వ్యక్తిని పోలీసుల సాయంతో పెనుబల్లి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అ వ్యక్తి మృతి చెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. ఆ వ్యక్తికి 40 సంత్సరాల వయస్సు ఉన్నట్లుగా తెలుస్తుంది. కుడి భుజంపై సూర్యుని గుర్తు పచ్చబొట్టు కలిగి ఉన్నాడు.

మతిస్థిమితంలేని..

ఏన్కూరు: మతిస్థిమితంలేని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని హిమాంనగర్ గ్రామ సమీపంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... గ్రామ సమీపంలోని కోళ్లఫారం ఎదురుగా ఓ మృతదేహాన్ని కోళ్లఫారంలో పనిచేసే వ్యక్తి గమనించాడు. ఉదయం చెత్తను పడేసేందుకు వెళ్లగా వ్యక్తి శవం కనిపించడంతో వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మతిస్థిమితంలేని గుర్తుతెలియని వ్యక్తిగా గుర్తించారు. కుడిచేయి లేదని, ఒంటిపై కేవలం నిక్కర్ మాత్రమే ఉంది. మృతుడికి సుమారు 45ఏళ్ల వయస్సు ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని ఖమ్మం అన్నం ఫౌండేషన్‌కు అందించారు. ఎస్ఐ రఫి కేసు నమోదు చేశారు.

సేంద్రియ పేరుతో పాల ఉత్పత్తుల కల్తీ?

» పెద్ద ఎత్తున ఫిర్యాదు చేసిన బాధితులు
» తనిఖీలు చేపట్టిన ఆహారపు నాణ్యతా ప్రమాణాలశాఖ అధికారులు
» పాలు, పెరుగుల శ్యాంపిల్స్ సేకరణ


పాల కల్తీని తనిఖీ చేస్తున్న గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆహార నాణ్యతా ప్రమాణాల పరిశీలన శాఖ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే కల్తీ పాల ఉత్పత్తుల సంఘటన ఖమ్మంలో కలకలం లేపింది. ఇప్పటి వరకు సేంద్రియ వ్యవసాయం, సేంద్రియ కూరగాయాలు, సేంద్రియ పండ్లు మాత్రమే తింటున్న ప్రజలకు చివరకు పాలకు కూడా సేంద్రియ పేర్లు పెట్టి మరీ కల్తీ చేస్తున్నారు. ఖమ్మం నగరంలోని టీడీపీ సెంటర్‌లో ఎటువంటి వ్యాపార అనుమతి లైసెన్స్‌లు లేకుండా బొమ్మిశెట్టి ఆర్గానిక్స్ నిర్వహిస్తున్నారు. పాలు, తెనే కొనుగోలు చేసిన వినియోగదారులు కల్తీ జరిగిందని జిల్లా ఆహారపు నాణ్యతా ప్రమాణాల శాఖ అధికారి కిరణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. టీడీపీ కార్యాలయం సెంటర్‌కు చెందిన కొల్లు రామారావు ఇటీవల కాలంలో బొమ్మిశెట్టి ఆర్గానిక్స్‌లో పాలు, పరమేశ్వరరావు తేనే కొనుగోలు చేశారు. అయితే పాలు, తెనేలో బంక వలే పదార్థాలు కనిపించటంతో వారికి అనుమానం కలిగింది. దీంతో పలుమార్లు దుకాణం నిర్వాహకులను ప్రశ్నించగా ఆర్గానిక్స్ అలానే ఉంటాయని సమర్థించుకున్నారు. ఈ క్రమంలో అనుమానం చెందిన కొల్లు రామారావు జిల్లా ఆహారపు నాణ్యతా ప్రమాణాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కొందరు కల్తీ జరుగుతుందని, ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. కల్తీపై అనుమానంతో పాలు, పెరుగు శ్యాంపిల్స్ సేకరించినట్లు జిల్లా గెజిటెడ్ అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు.

బీటీపీఎస్‌ను సందర్శించిన జెన్కో సీఎండీ



మణుగూరురూరల్, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): మణుగూరులోని బీటీపీఎస్‌ను జెన్కోసీఎండీ సందీప్ కుమార్ సుల్తానియా మంగళవారం సందర్శించారు. సీఎండీకి సెక్యూరిటీ సిబ్బంది బీటీపీఎస్ సీఈ బిచ్చన్న గౌరవ వందనం చేసి ఆహ్వానించారు. సీఎండీ బీటీపీఎస్‌లోని యూనిట్ల పని తీరుపై అధికారులతో మాట్లాడారు. పరిశీలనలు చేశారు. సీపీఐ రాష్ట్రనేత బీ. అయోధ్య సీఎండీని కలుసుకుని బీటీపీఎస్ ప్రభావిత ప్రాంతాల్లో మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. మద్దెల వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. స్పందించిన సీఎండీ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పుల్లారెడ్డి, కామిశెట్టి రామారావు, పులిగల రమేష్, మేడా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

తల్లాడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నాలుగురోజుల క్రితం వడదెబ్బకు గురై చికిత్స పొందుతూ ఓ మహిళ మృతిచెందింది. ఈనెల 4న మిర్చితోట కోసేందుకు వెళ్లిన తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన గుడిపల్లి వెంకమ్మ(59) వడదెబ్బకు గురైంది. అస్వస్థతకు గురైన వెంకమ్మను తల్లాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. మెరుగైన వైద్యం కోసం మంగళవారం ఖమ్మం తరలించారు. ఖమ్మంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. వెంకమ్మకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆరునెలల క్రితం వెంకమ్మ భర్త భాస్కర్‌రావు అనారోగ్యంతో మృతిచెందాడు.

బంగారు గొలుసు అపహరణ

చింతకాని, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్‌బీకు చెందిన రూ.70వేలు విలువ చేసే రెండు తులాల బంగారు గొలుసు అపహరణకు గురైంది. బాధితురాలు స్నానం చేసేందుకు వెళ్లగాఈ ఘటన జరిగింది. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేశారు.

ఆర్ఎంపీపై పోలీసులకు ఫిర్యాదు

వైద్యం వికటించి ఐదేళ్ల బాలుడికి తీవ్ర అస్వస్థత

జూలూరుపాడు, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపకొల్లులో వైద్యం వికటించి ఐదేళ్ల బాలుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో బాలుడి కుటుంబ సభ్యులు సోమవారం రాత్రి ఆర్ఎంపీ వైద్యుడిపై జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలుడి తండ్రి కుమార్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. పాపకొల్లు గ్రామంలోని భీమ్లా తండా గ్రామానికి చెందిన అజ్మీరా అభిరాంకు జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు వైద్యం చేయించేందుకు పాపకొల్లు గ్రామంలోని ఓ ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు ఈనెల 5న రాత్రి 7 గంటల సమయంలో తీసుకెళ్లారు. సదరు ఆర్ఎంపీ బాలుడిని పరీక్షించి రెండు ఇంజెక్షన్‌లు చేసి పంపించాడు. ఇంటికి వెళుతుండగా మార్గం మధ్యంలో బాలుడు వాంతులు చేసుకుంటూ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే కుటుంబ సభ్యులు కొత్తగూడెంలోని ఒక ప్రవేట్ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. వైద్యుడు పరీక్షలు నిర్వహించి ఇంజెక్షన్ వికటించడంతోనే బాలుడు అపస్మారక స్థితిలోకి వెళ్లాడని తెలిపారు. దీంతో మెరుగైన వైద్య చికిత్సలను అందించేందుకు ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో బాలుడు చికిత్స పొందుతున్నాడు. హైడోస్ ఇంజెక్షన్‌లు ఇచ్చి నా కుమారుడు తీవ్ర అస్వస్థతకు(ప్రాణపాయస్థితికి) కారణమైన ఆర్ఎంపీ వైద్యుడిపై చర్య తీసుకుని న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాలుడి తండ్రి తెలిపారు.

వేటగాళ్ల ఉచ్చుకు ఆవు బలి



అశ్వాపురం ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని సత్యనారాయణపురం ఫారెస్ట్ బీట్ లో వేటగాళ్లు అమర్చిన ఉచ్చులో పడి పాడిఆవు మృత్యువాతకు గురైంది. ఈ సంఘటన మంగళవారం వెలుగుచూసింది.చింతకుంట వలస ఆదివాసీ గ్రామానికి చెందిన సోడె లక్ష్మయ్య ఆవు నాలుగురోజుల క్రితం మేతకు వెళ్లి తిరిగిరాలేదు. యజమాని అడవిలో ఆవుకోసం గాలిస్తుండగా సత్యనారాయణపురం బీట్ పరిధిలోని శివలింగాపురం పల్లెప్రకృతివనం సమీపంలో ఉచ్చులో పడి చనిపోయింది. దాని విలువ సుమారు 70వేలవరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్‌కు ఉదయ్



దమ్మపేట, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ పాఠశాల పిల్లల కోసం నిర్వహించే యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్‌కు మందలపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బారి ఉదయ్ ఎంపికైనట్లు ప్రిన్స్‌పాల్ కె.వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు అంతరిక్ష సాంకేతికత,అంతరిక్షశాస్త్రం, అంతరిక్ష అనువర్తనాలపై ప్రాథమిక జ్ఞానాన్ని అందించటానికి ఇస్రో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని హైదారాబాద్‌లో ఎన్ఆర్ఎస్‌సిలో మే18నుంచి 30వరకు నిర్వహించనున్నారు. రాష్ట్రంనుంచి 10మంది విద్యార్థులు ఎంపిక కాగా వారిలో ఉదయ్ ఒకరు.

ప్రజల ఆశలపై నీళ్లు చల్లిన సీఎం రేవంత్

సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు

భద్రాచలం,ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణ సమస్యలపై ప్రకటన చేస్తారని ఎదురు చూసిన ప్రజల ఆశలపై ముఖ్యమంత్రి నీళ్లు చల్లారని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. భద్రాచలంలో మంగళవారం జరిగిన సీపీఎం సమావేశంలో మాట్లాడారు. భద్రాచలం అభివృద్ధిపై ఎటువంటి ప్రకటన చేయకుండా వివక్షతను ప్రదర్శించడం సరైంది కాదన్నారు. పట్టణ సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లలేని అసమర్థ ప్రజాప్రతినిధులు ఉండటం ప్రజల దౌర్భాగ్యమన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలను తీసుకెళ్లేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రభుత్వం పోలీసులు అక్రమ అరెస్టులు చేసి అడ్డుకోవడం అప్రజాస్వామిక చర్యని పేర్కొన్నారు. పోలవరం బ్యాక్ వాటర్‌తో గోదావరి ముంపు నుంచి భద్రాచలం పట్టణ రక్షణకు శాశ్వత పరిష్కారం చూపకుండా బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఈ సమావేశంలో ఎంబి నర్సారెడ్డి, పి.సంతోష్‌కుమార్, డి.సీతాలక్ష్మి పాల్గొన్నారు.



వృత్తి శిక్షణ సంస్థల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్, మైనారిటీలకు వృత్తి శిక్షణ అందించేందుకు శిక్షణ సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటి సంక్షేమ శాఖ అధికారి బి. పురంధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ సంస్థలు జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థ, టాస్క్, ఈజీఎంఎం, ఎంఎస్ఎంఈతో గుర్తింపు, అనుసంధానం అయి ఉండాలని, కేంద్ర ప్రభుత్వ మొదలగు వారిచే శిక్షణ పార్ట్‌నర్‌గా ఉన్న సంస్థలు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఈ దరఖాస్తులను ఈనెల 12 లోగా రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటి ఫైనాన్స్ కార్పొరేషన్ హైదరాబాద్‌లో పూర్తి వివరాలతో రెండు సెట్ల దరఖాస్తులను అందించాలని తెలిపారు.

‘సదరం’ ధ్రువీకరణకు 43 మంది హాజరు



వికలత్వాన్ని పరిశీలిస్తున్న వైద్యులు, హాజరైన బాధితులు

ఖమ్మంకలెక్టరేట్,ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): యూడీఐడీ సదరం క్యాంపును మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించారు.ఈ క్యాంపుకు అవగాహన లేని కారణంగా అతి తక్కువ మంది హాజరయ్యారు. మంగళవారం జిల్లా ఆస్పత్రిలో సదరం క్యాంపును నిర్వహించారు. 80 మంది మీసేవల్లో రిజిస్ట్రేషన్ చేసుకోగా 43మంది మాత్రమే హాజరయ్యారు. వీరిలో అతితక్కువ మంది మాత్రమే అర్హులుగా గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. యూడీఐడీ కార్డు కోసం ప్రత్యేకంగా క్యాంపులో ఏర్పాట్లు చేయాల్సి ఉన్నప్పటికీ సాధారణంగానే క్యాంపును నిర్వహించారు. గతంలో నాలుగు అంశాల్లోనే వికలత్వం ధ్రువీకరణ పత్రాలను అందించే వారు. కానీ సవరించిన అంశాల మేరకు 21అంశాల్లో పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. కానీ ఈ అంశాల్లో క్యాంపులను నిర్వహించేందుకు ప్రత్యేక గదులతో పాటు ప్రత్యేక పరికరాలు కూడా అవసరం ఉంటుందని అంచనాలు వేశారు.వివిధ విభాగాల నుంచి దాదాపు నాలుగు కోట్ల విలువైన పరికరాలు అవసరం ఉందని అంచనాలు సిద్ధం చేసినట్లు తెలిసింది. ఆస్పత్రి అధికారులు మాత్రం సదరం శిబిరానికి కావాల్సిన సదుపాయాలు, సౌకర్యాలపై నివేదించినట్లు తెలిపారు. శిబిరాన్ని జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులుబి.కిరణ్‌కుమార్ పరిశీలించారు. వైద్యులు ఎస్.రాంప్రసాద్, రాజేష్ వారిని పరీక్షించారు.

ఎగనామానికి చెక్!

» మెడికల్ కళాశాలలో కొత్త హాజరు విధానం

» ప్రయోగాత్మకంగా అమలు



ఖమ్మంకలెక్టరేట్, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో ఇక విధుల్లో ఉన్న స్థానం నుంచే హాజరు వేసుకునే విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆధార్ నంబర్ అనుసంధానంగా 'అబాస్'(ఆధార్ బెస్ట్ అంటెండెన్స్ సిస్టం)ను ఉపయోగిస్తున్నారు. డైరెక్టర్ ఆఫ్ హెల్త్ నుంచి వచ్చిన ఉత్తర్వులు ఆధారంగా తొలుత ఖమ్మం మెడికల్ కళాశాల, దానికి అనుసంధానంగా ఉన్న ఆస్పత్రిలోనూ బయోమెట్రిక్ విధానాన్ని అమలుచేస్తున్నారు. తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ సంస్థ అభివృద్ధి చేసిన మొబైల్ ముఖ ఆధారిత, జియోఫెన్స్ విధానంలో నూతన సాంకేతికతను తీసుకొచ్చింది. బయోమెట్రిక్ ఉన్న చోట కూడా కొత్త విధానంలోనే హాజరు వేసుకోవాలని స్పష్టం చేసింది. విధుల్లో ఉన్నట్లు చెప్పి.. డుమ్మా కొట్టే వారికి ఈవిధానంతో చెక్ పడనుంది. ప్రస్తుతం జిల్లా ఆస్పత్రిలో అధికారులు, సిబ్బందికి కూడా బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నారు. మెడికల్ కళాశాలలో (డీఎంఈ) పరిధిలో దీన్ని జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలుచేస్తున్నారు.

ఆధార్‌నెంబర్ ఆధారంగా..

ఖమ్మం మెడికల్ కళాశాలలో మూడు విధాలుగా బయోమెట్రిక్‌ను అమలు చేస్తున్నారు. మొత్తం 162 వైద్యులకు ఒకవిధానంలో, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు 84, సానిటేషన్ సిబ్బంది 40, మినిస్టీరియల్ స్టాఫ్ 12 మంది వీరందరికీ విడివిడిగా బయోమెట్రిక్ మిషన్లను ఏర్పాటు చేశారు. ఉద్యోగి ఆధార్‌నెంబర్ ఆధారంగా ఐడీ ద్వారా అటెండెన్స్ పడేలా చర్యలు తీసుకున్నారు. దీని ఆధారంగానే వారికి వేతనాలు కూడా చెల్లించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. బయోమెట్రిక్ విధానంతో ఆస్పత్రిలో డాక్టర్లు, సిబ్బంది, సమయపాలనకు ఆస్కారం ఉంటుందని ఆశాభావం వ్యక్తం అవుతోంది.

ప్రతీ ఒక్కరూ పాటించాల్సిందే

డాక్టర్ రాజేశ్వరరావు, ఖమ్మం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్



మెడికల్ కళాశాలలో విధుల్లో నిర్లక్ష్యం చేసే ఏస్థాయి అధికారి, సిబ్బంది అయినా ఉపేక్షించేది లేదు.. ప్రభుత్వం నూతన హాజరు విధానాన్ని అమలు చేయాలని ఆదేశించింది. అందుకు తగినట్లుగానే ఏర్పాట్లు చేశారు.ప్రిన్సిపాల్ నుంచి సానిటేషన్ సిబ్బంది వరకు ఈవిధానాన్ని అనుసరించాల్సిందే. మెరుగైన సేవలందించాలంటే ప్రతీ ఒక్కరూ సమయం పాటించాల్సిందే.

ఇంధన ధరలు తగ్గించాలి

మాస్‌లైన్ జిల్లానాయకుడు కమ్మకోమటి

తిరుమలాయపాలెం, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లానాయకుడు కమ్మకోమటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పిండిప్రోలులో రాయల వెంకటనారాయణ స్మారకభవనంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచడం సామాన్య, మధ్య తరగతివారిపై ఆర్థికభారాలు పడతాయన్నారు. ఎన్నికలసమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి అమలుకాని వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి అనంతరం వాటిని విస్మరిస్తున్నారన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని పార్టీ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు, పి.వెంకటస్వామి, యడ్లపల్లి నవీన్, మీగడ సత్యం, అరెంపుల వెంకన్న, రాయిండ్ల చిరంజీవి, పరికపల్లి మధు పాల్గొన్నారు.

శ్రీకాంత్ మరణం కార్మిక వర్గానికి తీరని లోటు

ఖమ్మంరూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యుడు, కార్మిక వర్గ పక్షపాతి యర్రా శ్రీకాంత్ హఠాన్మరణం చెందడం సీపీఎంకు, కార్మికవర్గానికి తీరని లోటని సీపీఎం ఖమ్మంరూరల్ మండల కార్యదర్శి ఊరడి సుదర్శన్ రెడ్డి అన్నారు. వరంగల్‌క్రాస్ రోడ్డులోని తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో మంగళవారం యర్రా శ్రీకాంత్ చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతి సీపీఎంకి,ఖమ్మం మార్కెట్ కార్మికులకు తీరని లోటన్నారు. బుధవారం ఉదయం గ్రైన్ మార్కెట్ వద్ద బోస్‌సెంటర్ నుంచి శ్రీకాంత్ అంతిమయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నంద్రా ప్రసాద్, సీనియర్ నాయకులు బత్తినేని వెంకటేశ్వర్లు, సిద్దినేని కోటయ్యపి.సంగయ్య పాల్గొన్నారు.

రఘునాథపాలెం మండల కాంగ్రెస్ సమవేశం

రఘునాథపాలెం ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి) మండలకాంగ్రెస్ సమావేశం మంగళవారం ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మండల కాగ్రెస్ అధ్యక్షుడు దీప్లనాయక్ అధ్వర్యంలో జరిగింది.జైబాపు జైభీమ్ జైసంవిదన్ ప్రోగ్రాం మీద చర్చించారు. ఈ సమావేశంలో మార్కెట్ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, ఆత్మ చైర్మన్ దిరిశాల వేంకటేశ్వర్లు, మండల అడహాక్ కమిటీ సభ్యులు పాల్గొనారు.

జీవో 21ను రద్దుచేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి,ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్, పార్ట్‌టైం అధ్యాపకులను క్రమబద్ధీకరించకుండా నేరుగా అధ్యాపక పోస్టుల భర్తీకీ ప్రభుత్వం జారీ చేసిన జీవోను నెంబరు 21ను రద్దు చేయాలని మంగళవారం నగరంలోని పీజీ, వ్యాయామ కళాశాల కాంట్రాక్ట్, పార్ట్‌టైం అధ్యాపకులు తరగతులు బహిష్కరించారు. నేరుగా అధ్యాపకుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం జీవో జారీచేయటం తగదని కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ అన్నారు.ఈకార్యక్రమంలో గోపి, శ్యాంబాబు, కోటి,రమ,వీరన్న పాల్గొన్నారు.

పాత పునాదులపై కొత్త నిర్మాణం

» నాసిరకం ఇసుకతో మరుగుదొడ్డి..

» ఆగ్రహించిన గ్రామస్థులు



పాత పునాదిపైనే నిర్మాణం చేపట్టిన మరుగుదొడ్డి, నాసిరకం ఇసుక

కామేపల్లి,ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): పాత పునాదులపైనే కొత్తనిర్మాణం చేపడుతూ ప్రభుత్వ ధనాన్ని కాంట్రాక్టర్ దోచుకుంటున్నాడు. మట్టితో కూడిన నాసిరకం ఇసుకతో నిర్మాణం చేపట్టినా పంచాయతీరాజ్ అధికారులు పట్టించుకోవటం లేదు. కామేపల్లి మండలం పింజర మడుగు గ్రామంలో-2 అంగన్‌వాడీ కేంద్రంలో మరుగుదొడ్డి శిథిలావ్యవస్థలో ఉండడంతో చిన్నారులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు రూ.32వేలు మంజూరు చేశారు. ఆ పర్యేక్షణ బాధ్యతలను పంచాయితీరాజ్ శాఖ అప్పగించింది. కానీ అధికారులు పట్టించుకోవపోవడం వలన కాంట్రాక్టర్ పాతగోడలనే పగలగొట్టి అదే పుట్టింగ్ మీద గోడల నిర్మాణం చేపట్టాడు. నాసిరకంగా ఇసుకతో గోడలను నిర్మించాడు. ఆ నిర్మాణం కూడా ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా నిర్మించలేదు. మంగళవారం వచ్చిన గాలిదుమారంతో వేసిన రేకులు కూడా లేచిపోయాయి. ఈ నిర్మాణంపై ఏఈ అశోక్‌ను వివరణ కోరగా నిధులు తక్కువగా ఉన్నాయని ఆ కారణంగా ఆగోడలను అంగన్‌వాడీ గోడకు అనుకొని కట్టించామని తెలపడం గమనార్హం. దీంతో నాసిరకంగా కడుతున్నారని గ్రామస్థులు ఆగ్రహించారు.

ఫ్లెక్సీలు తెచ్చిన కరెంట్ కష్టాలు

గాలి దుమారానికి విద్యుత్ తీగలపై పడి గంటల తరబడి విద్యుత్ అంతరాయం



విద్యుత్ తీగలపై పడిన ఫ్లెక్సీలు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో విద్యుత్ వ్యవస్థను వేసవి కాలానికి ముందే ముందస్తు చర్యల్లో భాగంగా నిర్మాణం చేశారు. కానీ కొద్ది పాటి గాలి దుమారానికి గంటల తరబడి విద్యుత్ కోతలు తప్పటం లేదు. నగరంలో విచ్చలవిడిగా ప్రతీవీధిలో ఫ్లెక్సీలు వెలిచాయి. దీంతో చిన్నపాటి గాలి దుమారానికి ఇవి విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు వీటిపై చర్యలు తీసుకో కుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

జాగ్రత్తగా మూల్యాంకనం చేయాలి

మోడల్ స్కూల్ డైరెక్టర్, మూల్యాంకన కేంద్రం పరిశీలకుడు శ్రీనివాసచారి

ఖమ్మంఖానాపురం హవేలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రతీపేపర్‌ను జాగ్రత్తగా మూల్యాంకనం చేయాలని మోడల్ స్కూల్ డైరెక్టర్, మూల్యాంకన కేంద్రం పరిశీలకుడు శ్రీనివాసచారి పేర్కొన్నారు. నగరంలోని సెంయిట్ జోసెఫ్ పాఠశాల పదోతరగతి మూల్యాంకన కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. మూల్యాంకనం జరుగుతున్న గదులను పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. పొరపాట్లకు తావులేకుండా మూల్యాంకనం నిర్వహించాలని, ప్రతీ పేపరును క్షుణ్ణంగా పరిశీలించాలని, అధికంగా మార్కులు వచ్చిన పేపర్లను మరలా ఒకసారి సంబంధిత అధికారులు పరిశీలించాలని సూచించారు. తప్పు ఒప్పులను సక్రమంగా చూడాలని, మూల్యాంకన కేంద్రంలోకి మొబైల్ ఫోన్లను అనుమతించవద్దని ఆదేశించారు. సుమారు 200 మందికి పైగా మినహాయింపు ఇవ్వాలని వినతిపత్రాలు అందించగా వారిలో అనారోగ్య సమస్యలు అధికంగా ఉన్న వారి విజ్ఞప్తులను పరిశీలలించి కలెక్టర్ అనుమతితో మినహాహింపు ఇవ్వటం జరుగుతుందని డీఈవో తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

ఖమ్మంఖానాపురంహవేలి,ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సిద్ధారెడ్డి కళాశాల పూర్వ విద్యార్థి, జిల్లా కోర్టు సహకారం సంఘం కార్యాలయ ఉద్యోగి మిరియాల వెంకటేశ్వర ప్రసాద్ ఆకస్మిక మృతికి పూర్వ విద్యార్థులు సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలోని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుమార్తె తబుశ్రీ ఇంజనీరింగ్ విద్య కొనసాగించేందుకు రూ.1.42లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల బృందం కన్వీనర్ టి. వేణు, ప్రముఖ న్యాయవాది ముదిరెడ్డి. నిరంజన్‌రెడ్డి, జర్నలిస్టు పారుపల్లి శ్రీధర్, రెజోనెన్స్ విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీధర్‌రావు, క్రాంతికుమార్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి చెక్కు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజారోగ్య సేవలను విస్తృత పరచాలి

» జిల్లా వైద్యారోగ్య అధికారి కళావతిబాయి

» ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

ఖమ్మంకలెక్టరేట్, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వీడి ప్రజలకు ఆరోగ్య సేవలు విస్తృత పరచాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కళావతీబాయి ఆదేశించారు. మంగళవారంఎంఎల్‌హెచ్‌పీ(మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ల)కు విధి నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు మాతాశిశు సంక్షేమం, వ్యాధినిరోధక టీకాలు, ఎయిడ్స్ లెప్రసీ, సంక్రమణ-అసంక్రమణ వ్యాధుల నిర్వహణ, క్షయవ్యాధి నివారణ కార్యక్రమాలు నిత్యం జరుగుతూనే ఉండాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో ప్రజల అవగాహన కల్పించాలన్నారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలన్నారు. విధి నిర్వహణలో ఏలాంటి అలసత్వాన్ని సహించేది లేదని హెచ్చరించారు. ప్రోగ్రాం ఆఫీసర్ రామారావు మాట్లాడుతూ ఆమ్(ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)లో అందుబాటులో ఉన్న 12రకాల ఆరోగ్య సేవలు గురించి వివరించారు. డాక్టర్ చందునాయక్ రొటీన్ ఇమ్మ్యునైజేషన్ కార్యక్రమాలు నిర్వహణ వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సైదులు, డాక్టర్ వెంకట రమణ, డెమో సుబ్రహ్మణ్యం, డీపీవో దుర్గ పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్‌ఓలో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో శ్రీవిద్య

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ (ఐఎన్‌టీఎస్‌ఓ) జాతీయ పరీక్షల్లో నగరంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలలో 4, 6, 7, 9 తరగతులు చదివే విద్యార్థులు పలువురికి గోల్డ్‌మెడల్స్, ల్యాబ్‌ట్యాబ్‌లు సాధించారని విద్యాసంస్థల డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ టీఎస్‌ఎల్ శర్మ, నాగప్రవీణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెమెంటోల బహూకరణ

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వండర్ కిడ్స్ పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన సైన్స్ ఎక్స్‌పో, ఒలిపియాడ్, ఐఐటీలలో గెలుపొందారు. ప్రతిభకనపరిచిన విద్యార్థులకు మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ తోట రామారావు గోవిందమ్మ, పాఠశాల కరస్పాండెంట్ కె శ్రీధర్‌రెడ్డి సీల్డ్ మెమోంటోలను అందించారు. వారిని అభినందించారు.

ప్రతీ దరఖాస్తుదారుడికి రశీదు ఇవ్వాలి

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంసంక్షేమవిభాగం, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తులు చేసిన ప్రతీ దరఖాస్తుదారుడికి రశీదులు ఇవ్వాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. మంగళవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలోని రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల కౌంటర్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. కౌంటర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న సిబ్బందితో మాట్లాడారు. దరఖాస్తుదారులకు ఎటువంటి సందేశాలు వస్తున్నాయి, వాటికి కౌంటర్లు వద్ద ఎటువంటి సమాధానం చెపుతున్నారని ప్రశ్నించారు. రోజుకు ఎన్ని దరఖాస్తులు అందుతున్నాయి. ఏలా నిర్వహణ చేపట్టారని ప్రశ్నించారు. రశీదులు ఇవ్వకుంటే వారికి సరైన న్యాయం జరగదని తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు. సమయం తక్కువగా ఉన్నందున ఎక్కువ కౌంటర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఖమ్మంక్రైం,ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో బంగారు గొలుసు గుర్తుతెలియని వ్యక్తులు లాక్కెళ్లారు. ఈ ఘటన మంగళవారం రాత్రి ఖమ్మంలో జరిగింది. టూటౌన్ సీఐ బాలకృష్ణ వివరాల ప్రకారం.. నగరంలోని మామిళ్ళగూడెంలో నివాసముంటున్న లింగం విజయ టైలర్‌గా విధులు పనిచేస్తోంది. మంగళవారం రాత్రి 8గంటల సమయంలో షాపునుంచి ఇంటికి వెళ్తుండగా అదే సమయంలో కరెంటు పోయింది. గుర్తుతెలియని వ్యక్తి నడుచుకుంటూ వకామె మెడలోని బంగారు గొలుసులు లాక్కొని, అతడి వెనుక ఉన్న మరో వ్యక్తి ద్విచక్రవాహనంపై ఎక్కి పారిపోయాడు. ఈ సంఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు వివరాలు సేకరించారు.

12 వరకు శ్రీనిధి ఆస్పత్రిలో మెడికల్ క్యాంపు

ఖమ్మంకలెక్టరేట్,ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): నగరంలో శ్రీనిధి సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌లో నిర్వహిస్తున్న క్యాంపు 12 వరకు కొనసాగుతుందని హాస్పిటల్ ఎండీ భీమిరెడ్డి బాబురెడ్డి తెలిపారు. మంగళవారం 60 మందికి జనరల్ మెడిసిన్ క్యాంపులో పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. క్యాంప్ ఏప్రిల్ 9,10,11,12 వరకు కొనసాగించనున్నట్లు ఆయన తెలిపారు.

‘రాజీవ్‌యువ వికాసం’పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న జ్యోతి, పురంధర్

ఖమ్మం ఖానాపురంహవేలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రాజీవ్ యువవికాసం పథకంపై మంగళవారం నగరంలోని కలెక్టరేట్‌లో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జి.జ్యోతి, మైనారిటి సంక్షేమ శాఖ అధికారి బి. పురంధర్ ఆధ్వర్యంలో బీసీ, ఎంబీసీ, ముస్లీం, క్రైస్తవ, ఓబీసీ సంఘాల నాయకులకు అవగాహన కల్పించారు. రేషన్ కార్డుదారులకు ఇన్‌కం సర్టిఫికెట్ అవసరం లేదని, ఆన్‌లైన్ అయినవారు, కానివారు ఈనెల 14లోపు దరఖాస్తులను మండల, మునిసిపల్ కార్యాలయాలలో అందించాలని అన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా బీసీ, మైనారిటి కార్యాలయలలో సంప్రదించాలని తెలిపారు. పలువురు బీసీ, మైనారిటీ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం రేషన్ కార్డులు, ఆదాయ సర్టిపికెట్లు లేనివారు చాలా మంది ఉన్నారని వివరించారు. వివిధ మండలాల్లో సకాలంలో సర్టిఫికెట్లు అందక దరఖాస్తులు చేయలేకపోతున్నారని అధికారులకు చెప్పారు. బ్యాంకర్లు సామాన్యులకు లోను ఇచ్చే పరిస్థితి లేదని, బ్యాంక్ కంసెంట్ లెటర్ ఉంటేనే పథకం అందుతుందని, కానీ బ్యాంకర్ల సమస్య కారణంగా దరఖాస్తులు చేసుకోలేక పోతున్నారని వివరించారు. ఈ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. అన్నిసంఘాల నాయకులు ఈ రెండు రోజుల్లో మీమీ పరిధిలో పథకంపై మరిన్ని దరఖాస్తులు చేసేలా కృషి చేయాలని తెలిపారు.



ప్రతీ కుటుంబానికి పథకాలు అందిస్తాం



లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

» ఎమ్మెల్యే మట్టా రాగమయి

కల్లూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. మంగళవారం కల్లూరులో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారాక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత ఆర్థిక భారమైన పేదల కోసం సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో రూ.200 కోట్లతో సమీకృత పాఠశాలను ఏర్పాటుకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. అనంతరం ఏఎంసీలో పీఏసీఎస్ తరఫున ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు, లక్కినేని కృష్ణ, కాకతీయ షుగర్స్ చైర్మన్ కస్తాల నరేంద్ర, తక్కెళ్లపాటి ప్రసాద్, బాగం ప్రభాకరచౌదరి, పెద్దబోయిన శ్రీను, తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, సీఈవో శ్రీనువాసరావు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో అధిక లాభాలు: జేడీఏ



పంటను పరిశీలిస్తున్న జేడీఏ పుల్లయ్య

చింతకాని, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట పంటతో అధిక లాభాలున్నాయని జేడీఏ ధనసారి పుల్లయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన వరి పొలాలను పరిశీలించారు. వరి మాగాణుల్లో పచ్చి రొట్ట పెంచి కలియ దున్నాలన్నారు. ఎన్ఎఫ్ఎస్ఎం ద్వారా పంపిణీ చేసిన ఎంటీయూ 1010 వరి పంట సాగుపై రైతులతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో మానస, ఏఈవోలు ఆయేషా, రాము, తేజ, కార్తీక్, కళ్యాణి పాల్గొన్నారు.

గుంతలమయంగా రహదారులు

» గ్రీన్‌ఫీల్డ్ వాహనాలతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయని గ్రామస్థుల ఆవేదన
» మరమ్మతులు చేపట్టాలని వినతి » పట్టించుకోని అధికారులు



ధ్వంసమైన జన్నారం వెళ్లే రోడ్డు

ఏన్కూరు, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవే భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు ధ్వంసం అవుతున్నాయి. అయినా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా మండలంలోని జన్నారం గ్రామానికి వెళ్లే రోడ్డు ధ్వం సం అయింది. గుంతలు ఏర్పడి దుమ్ము, ధూళితో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతంది. నిత్యం వందలాది భారీ లారీల రా కపోకలతో ఖమ్మం నుంచి కొత్తగూడెం వెళ్లే ప్రధాన రహదారి ఏన్కూరు నుంచి పల్లిపాడు వెళ్లే రహదారికి కూడా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. జన్నారం గుట్టల నుంచి భారీ యంత్రాల సహాయంతో మట్టినితోడి లారీలతో తీసుకెళ్లడంతో దుమ్ము,ధూళి పంట పొలాలపై పడి పంటలకు నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓవర్‌లోడుతో వెళుతున్న వాహనాలను రవాణా శాఖ అధికారులు తనిఖీ చేయకపోవడంతో ఆగడాలకు అడ్డుఅదుపు లేకుండా పోయింది. లీజుకు తీసుకున్న పొలాల్లో మట్టిని తోడి గుంతలను పూడ్చడంలేదని గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులపై భూ యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఇటీవల అధికారులు రైతులు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకొని దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



● స్వర్ణ నరేంద్రకుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు

గ్రీన్‌ఫీల్డ్ భారీ లారీల వల్ల దెబ్బతిన్న జన్నారం రోడ్డకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. భారీ వాహనాల వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయి. దుమ్ము, ధూళితో ప్రయాణీకులకు అసౌకర్యం కలుగుతుంది. నిత్యం వందలాది లారీల రాకపోకల వల్ల గ్రామస్థులకు అసౌకర్యం కలుగుతుంది.

ఘనంగా అంకమ్మ తిరునాళ్లు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతుపల్లిలో వేంచేసియున్న బేతుపల్లి అంకమ్మతల్లి ఆలయంలో తిరునాళ్ల మహోత్సవాల సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మైలపట్నం కార్యక్రమం నిర్వహించారు. మైలపట్నం, కోలబియం కార్యక్రమాలు నిర్వహించగా చల్లగుళ్ల అజయ్‌బాబు, చల్లగుళ్ల లోకేశ్వరరావు దంపతులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించగా ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

12 నుంచి గురవమ్మతల్లి జాతర



గురవమ్మ తల్లి ఆలయం

కారేపల్లి, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పేరుపల్లి గ్రామంలో గల గురవమ్మతల్లి జాతర ఈనెల12నుంచి17వరకు నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబుచేశారు. జాతరకు మండలంల నుంచే కాకుండా ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల నుంచి వేలాది మంది తరలివచ్చి అమ్మవారికి పూజలు చేస్తారు. మొదటిరోజు శనివారం అమ్మవారికి పసుపు కుంకుమ్మలతో నిత్యపూజల కార్యక్రమంతో ప్రారంభమవుతాయి. ఆదివారం జలబిందెలు, సోమవారం అమ్మోవారి ఊరేగింపు, కల్యాణం, మంగళవారం పూలకప్పెర, గ్రామప్రభలు, బుధవారం అమ్మవారికి బోనాలు సమర్పణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తెలిపారు.

ప్రజా సమస్యల సర్వేను విజయవంతం చేయండి: సీపీఎం

వైరా, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): ప్రజాపోరాటాల ద్వారానే ప్రజాసమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఎం పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం,పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు అన్నారు. మంగళవారం వైరాలో పార్టీ డివిజన్ కమిటీ సభ్యుడు తోట నాగేశ్వర అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి అధ్యయనం సర్వే చేసి వాటి పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈనెల12 నుంచి 16వరకు ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలను సర్వే చేస్తామని అన్నారు. ఆయా సమస్యలను తెలియచేస్తూ ఈనెల17 నుంచి19వరకు గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించాలని కోరారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేసందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సుంకర సుధాకర్, బాణాల శ్రీనివాస్‌రావు, షేక్ మజీద్, ద్రోణాదుల నాగేశ్వరరావు, మేడ శంకరాబంది, దొంతేబోయిన గంటమ్మ,ఎండ్లురి రాధాకృష్ణ, షేక్‌రెహానా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భూక్యవీరభద్రం

గ్రంథాలయంలో సౌకర్యాలు కల్పించండి

» అదనపు కలెక్టర్ శ్రీజ



పాఠకులతో మాట్లాడుతున్న జేసీ శ్రీజ

సత్తుపల్లి, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షల కు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల సౌకర్యార్థం గ్రం థాలయంలో మెరుగైన సేవలందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ పీ.శ్రీజ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె సత్తుపల్లి మునిసిపాలిటీలో ఆకస్మికంగా పర్యటించారు. ముందుగా రూ.2కోట్ల అంచనా వ్యయంతో నిర్మితమవుతున్న వేంసూర్ రోడ్‌లోని మోడ్రన్ దోబీఘాట్‌ను సందర్శించారు. మిషనరీ, గార్డెనింగ్, కాంపౌండ్‌వాల్ త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్టీఆర్ నగర్‌లో రూ.1.48కోట్లతో నిర్మితమవుతున్న యూపీహెచ్‌సీ నిర్మాణాన్ని పరిశీలించి ప్రజలకు అందుబాటులో తేవాలని కోరారు. మహాత్మాగాంధీ రోడ్‌లోని ఇందిరమ్మ ఇళ్ల రీవెరిఫికేషన్ పరిశీలించి, పీఎంఏవైలో పొందుపరిచి జాబితాను పారదర్శకంగా రూపొందించాలని సూచించారు. పట్టణ శివారులో ఇటీవల ప్రారంభించుకున్న వివేకానంద ఎక్సలెన్సీని సందర్శించారు. అనంతరం ప్రభుత్వ గ్రంథాలయంలో పాఠకులు, అభ్యర్థులతో మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. సెలవు రోజులతో పాటు ప్రతిరోజూ ఉదయం 7గంటల నుంచి రాత్రి 9గంటల వరకు లైబ్రరీని తెరచి ఉంచాలని ఆదేశాలు జారీచేశారు. కంప్యూటర్లు, కుర్చీలు, బల్లాలను మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని కమిషనర్ కే.నర్సింహాను ఆదేశించారు. వేంసూర్ రోడ్‌లోని 156హెక్టార్ల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న నీలాద్రి అర్బన్ పార్క్‌ను సందర్శించారు. పర్యాటకులను ఆకర్షించేలా అదనపు ఆకర్షణలు ఏర్పాటు చేయాలని, కిడ్స్ పార్క్‌ను విస్తరించాలని, లేక్‌లో పెడల్ బోట్‌ను ఏర్పాటు చేయాలని, జీవాల సంరక్షణ విషయంలో జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. అదేవిధంగా ఎస్టీ గిరిజన వసతి గృహంతో పాటు సాంఘీక సంక్షేమ ఇంటిగ్రేటెడ్ వసతి గృహాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట కమిషనర్ కొండ్ర నర్సింహ, ఎంపీడీవో చిన్నా నాగేశ్వరరావు, ఫారెస్ట్ రేంజర్ స్నేహలత, ఈజీఎస్ ఏపీవో ఎం.బాబు, వార్డెన్లు బీ.రాములు, దారుగాబీ తదితరులు ఉన్నారు.



ఎంపీ రఘురాంరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

పెన్షనర్స్ భవన నిర్మాణానికి కృషి: ఎంపీ

వైరా, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వైరాలో విశ్రాంత ఉద్యోగుల సమావేశం హాల్ నిర్మాణం కోసం ఎంపీ నిధుల నుంచి ఈ ఆర్థిక సంవత్సరంలో సాయం అందిస్తానని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి హామీ ఇచ్చారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్‌తో కలిసి మంగళవారం ఖమ్మంలో ఎంపీని వైరా మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. విశ్రాంత ఉద్యోగులకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని ఎంపీ హామీ ఇచ్చారు. ఆసంఘం నాయకులు టీవీ.కృష్ణయ్యసూరి, కల్యాణం కృష్ణయ్య, ఎం.సుబ్బయ్య, తాళ్లూరి వేణు, చల్లా కృష్ణారావు, సామినేని వెంకటేశ్వరరావు, జి.సుబ్బయ్య, కె.నాగేశ్వరరావు ఉన్నారు.

నర్సరీలను పకడ్బందీగా నిర్వహించాలి: డీపీవో



నర్సరీలను పరిశీలిస్తున్న డీపీవో ఆశాలత

బోనకల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నర్సరీలను సమర్థవంతంగా నిర్వహించాలని డీపీవో ఆశాలత సూచించారు. బోనకల్‌లోని వైకుంఠధామం, నర్సరీలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో మొక్కలకు వేడి నుంచి రక్షణ కల్పించేందుకు గానూ రక్షణ పరదాలను ఏర్పాటు చేయాలన్నారు. మొక్కలకు ఉదయం, సాయంత్రం వేళల్లో నీళ్లు పట్టాలని కోరారు. డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శాస్త్రీ, కార్యదర్శి కోలా రాజేశ్వరి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

» మునిసిపల్ కమిషనర్ చింతావేణు

వైరా ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మునిసిపల్ కమిషనర్ చింతావేణు అన్నారు. వైరా మునిసిపాలిటీ పరిధిలోని 9, 19వార్డులలోని స్పెషల్ డ్రైవ్ కింద డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్తను మంగళవారం తొలగించారు. సిబ్బంది పాల్గొని పూర్తిస్థాయిలో చెత్తను తొలగించి పేరుకుపోయిన మురుగునీటిని తొలగించారు.

పోషకాహారం తీసుకోండి

» సీడీపీవో ఎన్.కనకదుర్గ



మాట్లాడుతున్న సీడీపీవో కనకదుర్గ

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకుని పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో ఎన్.కనకదుర్గ అన్నారు. మంగళవారం పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా సత్తుపల్లిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. పోషణ ఆహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మహాలక్ష్మి, రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగంగా జరపాలి



తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

» అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

కల్లూరు/తల్లాడ/పెనుబల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా జరపాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి నిర్వాహకులను కోరారు. మంగళవారం కల్లూరు, తల్లా డ, పెనుబల్లి మండలాల్లో పలు ధాన్యం కేం ద్రాలను, రైస్ మిల్లులను అదనపు కలెక్టర్, ఆర్డీవో ఎల్. రాజేంద్రగౌడ్‌లు ఆకస్మికంగా సం దర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా తల్లాడలోని నూతనకల్లు, కల్లూరులోని పుల్లయ్యబంజర ఐకేపీ కొనుగోలు కేంద్రాలను వారు పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో గన్ని సంచులు సరిపోను వస్తున్నాయా అని ఆరా తీశారు. జిల్లాలోనే పెద్దదైన పుల్లయ్యబంజర ధాన్యం కేంద్రంలో కేవలం 5 వేల బస్తాలు మాత్రమే వచ్చాయని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కాగా బుధవారం నాటికి మరో 20 వేలు గన్ని సంచులు పుల్లయ్యబంజర కేంద్రానికి అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు సాంబశివుడు గంటా ప్రతాప్, సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరావు, ఏవోలు తాజుద్దీన్, రూప, ఆర్ఐలు భాస్కర్, ఖాజామొయిద్దీన్, యాజమానులు వనమా సత్యప్రసాద్, ఎం.జనార్ధన్ తదితరులున్నారు.

'భూసార పరీక్షలు చేయించుకోవాలి'

ఏన్కూరు, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): రైతులు వేసవిలో తమ పంట పొలాలను భూసార పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలని డిప్యూటీ డైరెక్టర్, అగ్రికల్చర్ ఆఫ్ రైతు నేస్తం ప్రోగ్రాం కేంద్రం అధికారి (డీడీఎఫ్‌టీసీ) కె.అభిమన్యుడు తెలిపారు. మంగళవారం నాచారం రైతువేదికలో రైతునేస్తం ప్రోగ్రాం జరిగింది. ఈసందర్భంగా ఆయన రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. భూసారపరీక్షలను బట్టి వ్యవసాయశాఖ అధికారులు ఆదేశానుసారం పంటలను సాగుచేసుకోవాలన్నారు. వేసవికాలంలో పశువులకు సంక్రమించే వ్యాధులు వాటి చికిత్స మార్గాల గురించి వివరించారు. ఏ కాలంలో ఎటువంటి పంటలు పండించాలనే దానిపై వివరించారు. రసాయనిక ఎరువులు వాడకాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతిలో సాగుచేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఏవో ఎ.నరసింహారావు, వ్యవసాయ విస్తరణ అధికారులు అశోక్, బాలకృష్ణ, శ్రీకాంత్, భాగ్యలహరి, నవ్య, భవ్య రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అభిమన్యుడు

ఆర్థిక సాయం అందజేత



ఎంఈవోకు నగదును అందజేస్తున్న ఉపాధ్యాయులు

పెనుబల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వీఎంబంజర్ పాఠశాలకు చెందిన విద్యార్థి పాఠశాల నుంచి ఇంటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో చౌడారం గ్రామానికి చెందిన వంశీ తీవ్రంగా గాయపడి హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వంశీ ఆర్థిక పరిస్థితి సరిగా లేనందున ఆస్పత్రి ఖర్చులు భారంగా ఉండటంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంఈవో అయిన సత్యనారాయణ మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను కలిసి విరాళాలను సేకరించారు. ఈమేరకు వీఎంబంజర్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు రూ.65వేలు, మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రూ.35వేలను సేకరించారు. మొత్తం రూ.లక్షను విద్యార్థి ఆసుపత్రి ఖర్చులకు అందజేస్తామని ప్రకటించారు. ఉపాధ్యాయల సంఘాల నాయకులు ఈవీ.రామారావు, వనమా నాగేశ్వరరావు, నాళ్ల సురేష్, వీరస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ఎంఈవో అభినందించారు.

'బీజేపీ పార్టీని ప్రతి పల్లెకు తీసుకుపోవాలి'



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

మధిరటౌన్, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): బీజేపీ పార్టీని వాడ వాడకు తీసుకపోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గుగులోత్ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మధిర బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాన్ని గ్రామ స్థాయిలో ప్రచారం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శివరాజు సుమంత్, రమేష్, నాగేశ్వరరావు, సాంబ, రామయోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు సిద్ధంగా ఉండాలి



ప్రమాణం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మధిరటౌన్, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): బీజేపీ అనుసరిస్తున్న విధానాలతో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, రాజ్యాంగ రక్షణకు ప్రతి పౌరుడు నడుం బిగించాల్సిన సమయం వచ్చిందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పీసీసీ సభ్యుడు శ్రావణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఏఐసీసీ పిలుపు మేరకు మంగళవారం మధిరరెడ్డి గార్డెన్స్‌లో జరిగిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో వారు మాట్లాడుతు పార్లమెంటు సాక్షిగా దేశ హోంమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను అవమానించారని అన్నారు. స్వాతంత్రం సంగ్రామ సమయంలో పుట్టని బీజేపీ పార్టీ స్వాతంత్రం తెచ్చిన గాంధీని, రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్‌ను విమర్శించే హక్కు బీజేపీకి లేదని అన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుక పోయేందుకే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమాన్ని అమిత్‌షా పార్లమెంట్ లో అంబేద్కర్‌ను అవమానించిన 2025 జనవరి 25 నుంచి 2026 జనవరి 25 వరకు ఏడాది పాటు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, కాంగ్రెస్ ఓబీసీ సెల్ కన్వీనర్ పుచ్చకాయల వీరభద్రం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణు, మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహారావు, వైస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెంలో...

ఎర్రుపాలెం: భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోగల శుభమస్తు కళ్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమం సన్నాహక సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీచైర్మన్ బండారు నరసింహారావు, జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పువ్వాళ్ల

బోనకల్‌లో...

బోనకల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ప్రచారం చేయాలని పీసీసీ జనరల్ సెక్రటరీ శ్రావణ్‌కుమార్‌రెడ్డి కోరారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం అమలులో భాగంగా ముఖ్య నాయకుల స మావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లల్లో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని ఆరోపించారు. కమీషన్ల కోసం ప్రాజెక్టులు కట్టి సంపదను లూటీ చేశారని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలోనే రైతులకు రుణమాఫీ, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు, ఎస్సీ వర్గీకరణ బిల్లు, బీసీల రిజర్వేషన్‌ల అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం పేదల కోసం ఎంతో చేస్తుండగా, ప్రతిపక్షాలు మాత్రం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నందున కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గ ప్రసాద్, పైడిపల్లి కిషోర్ కుమార్, మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, దొప్పల సౌజన్య, చేబ్రోలు వెంకటేశ్వర్లు, సూర్యదేవర సుదాకర్, నర్సయ్యశాస్త్రీ, మరీదు శ్రీను, గఫూర్, రామాచారి, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి: సీపీఐ

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల మతోన్మాధ విధానాలను అరికట్టాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు గంటా శ్రీను, అమర్లపూడి శరత్ కోరారు. మంగళవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించి తహసీల్ధార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం అందజేశారు. ఆర్ఎస్ఎస్, బీజేపీల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలునిచ్చారు. కార్యక్రమంలో వెంకటేష్, రాఘవులు, రాజారావు, కృష్ణ, నాగప్రసాద్, నర్సమ్మ, పరిమళ, అలివేలు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు